ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 124
మంగళవారం 5 నవంబర్ 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## టెస్టుల్లో విఫలంపై రోహిత్‌పై విమర్శలు

దూకుడుగా ఆడడంతోనే సమస్యలన్న దినేశ్



.. వివరాలు 7లో

## ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- లాక్కున్న భూములను తిరిగి ఇచ్చే బాధ్యత మాదే
- పదేళ్లలో 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం
- జార్ఖండ్‌ను వ్యతిరేకించిన ఆర్జేడితో జెఎంఎం పొత్తు
- ఇక రాష్ట్రంలో అధికారం తమదే అన్న మోడీ
- జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని



ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారం హోరెత్తుతోంది. అధికార, విపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ చాయిబసలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని విపక్షాలపై తనదైన శైలిలో విరుచుకుపడ్డారు.

రాంచీ (రోమింగ్ న్యూస్) : ఝార్ఖండ్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ ఆదివాసీలపై అనాగరిక నేరాలకు పాల్పడ్డాయని ధ్వజమెత్తారు. ఆనాడు ఝార్ఖండ్ ఏర్పాటును ఆర్జేడీ వ్యతిరేకించిందన్న ప్రధాని.. ఇప్పుడు జేఎంఎం దాని ఒళ్లో కూర్చొందంటూ చురకలంటిం చారు. ఈ సారి రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకొని చరిత్ర లిఖిస్తామని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఝార్ఖండ్‌లో

మిగతా 2 లో



## తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- గత పదేళ్లుగా విద్యారంగం నిర్లక్ష్యం
- గాడిన పెట్టేలా చర్యలు తీసుకుంటున్నాం
- విద్యార్థులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్టి

గత పదేళ్లలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకే విప్లవాత్మక నిర్ణయాలతో ముందుకు వెళుతున్నామని అన్నారు.

హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : ప్రజా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఐటీఐలను

మిగతా 2 లో



## సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

అధికారులను ఆదేశించిన సీఎం రేవంత్

02



## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

- లోతైన లోయలోపడ్డ బస్సు
- 36మంది ప్రయాణికులు మృతి

04



## మిగ్-29 ఫైటర్ జెట్ క్రాష్

- సాంకేతిక కారణాలతో కుప్పకూలిన విమానం
- పైలట్లు సురక్షితం.. ఆగ్రా సమీపంలో ప్రమాదం

05



## కేసీఆర్ నుంచి రికవరీ చేసే దమ్ముందా?

- "సమగ్ర కుటుంబ సర్వే" నివేదిక ఏమైంది?
- ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు?
- మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకు?
- బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

.. వివరాలు 2లో

## హింసించే పులకేశిలా రేవంత్ ప్రభుత్వం

- ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పండి
- రాహుల్ రాకతో కేటీఆర్ బహిరంగ లేఖ

సీఎం రేవంత్ హింసించే రాజు పులకేశిలా తయారైండని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. ఇచ్చిన ఒక్క హామీని సైతం నిలబెట్టకోకుండా ప్రజలను మోసం చేశారని.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను హింసించే పులకేసి మాదిరిగా హింసిస్తుంటే.. ఏం తెలియనట్లుగా నటిస్తూ ఢిల్లీలో గప్‌చుప్ అయిపోయారని విమర్శించారు.



హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో ఆయనకు కేటీఆర్ సోమవారం బహిరంగ లేఖ రాశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి, సబ్బండ వర్గాలకు చేసిన మోసం, అభివృద్ధి తెలంగాణను అవినీతి తెలంగాణగా

మిగతా 2 లో



## పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

- ఎక్కడిక్కడే మాజీ సర్పంచ్‌ల అరెస్ట్
- మద్దతుగా బిఆర్ఎస్ నేతల ఆందోళన
- హరీష్ రావు తదితరుల అరెస్ట్
- అరెస్ట్‌లను ఖండించిన కేటీఆర్ తదితరులు

హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు. తమ సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు

మిగతా 2 లో



## గ్యారంటీలు, డిక్లరేషన్లు ఏమయ్యాయి?

- కాంగ్రెస్‌పాలనకు ఏడాది ముగుస్తుంది
- ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చింది
- గారడీలతో ప్రజలను మోసం చేస్తున్నది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నల వర్షం

.. వివరాలు 2లో


## నేడే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

- ట్రంప్, కమలా హారిస్ మధ్య పోటాపోటీ
- గెలుపోటములపై స్వల్ప తేడా అంటున్న విశ్లేషకులు
- న్యూయార్క్ రాష్ట్రంలో బెంగాలీలోనూ బ్యాలెట్

ఇప్పుడు అందరి దృష్టి అమెరికా అధ్యక్ష ఎన్నికలపైనే ఉంది. నవంబర్ 5న అంటే మంగళవారమే ఓటింగ్ జరుగగనుంది. అధ్యక్ష ఎన్నికలు తుది దశకు చేరుకోగానే ఇప్పుడు అందరి దృష్టి స్వింగ్ స్టేట్స్ పైనే ఉన్నాయి.

న్యూయార్క్, నవంబర్ 4 : అమెరికా ఎన్నికల ఫలితాలను మూడు రకాల రాష్ట్రాలు నిర్ణయిస్తాయి. వీటిని రెడ్, బ్లూ, స్వింగ్ స్టేట్స్ అంటారు. 1980 నుంచి రిపబ్లికన్స్ విజయం సాధిస్తున్న వాటిని రెడ్ స్టేట్స్

మిగతా 2 లో






ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024





# ఆదివాసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మొదటి పేజీ తరువాయి

భాజపా ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే చొరబాటుదారులను అడ్డుకొనేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అక్రమంగా లాక్కున్న భూమిని తిరిగి ఆదివాసీ మహిళల పేర్లపై బదలాయించేలా చట్టాన్ని తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి ఓటు బ్యాంకుకు అప్పగించేందుకు చూస్తోందని, ఓటు బ్యాంకు కోసం ఝార్ఖండ్ జనాభా మార్చే విషయంలో జేఎంఎం-కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. పేదల కష్టాలను దగ్గర నుంచి చూశానన్న మోదీ.. అందుకే పదేళ్లలో పేదల కోసం పథకాలు అమలు చేస్తున్నామ న్నారు. ఈ పథకాల ఫలితంగానే పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మాత్రం చాలా కాలంగా ఆదివాసీ సమాజాన్ని పేదరికంలోనే ఉంచాయని ఆక్షేపించారు. ఝార్ఖండ్‌లో పేదరిక నిర్మూలనకు భాజపా కట్టుబడి ఉందన్నారు. ఎన్డీయే కూటమి ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం రాష్ట్రంలోని ఛాయ్‌బస పట్టణంలో ఎన్నికల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమి జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తనకు ఇది రెండవ ర్యాలీయే అయినప్పటికీ గెలుపుపై ఇప్పటికే నమ్మకం కుదిరిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారం కోసం తొలిసారి ఇక్కడి వచ్చాను. ఇది నాకు రెండవ ఎన్నికల ర్యాలీ. ఈ రెండు ర్యాలీలు చూసిన తర్వాత.. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సగాని కంటే ఎక్కువ సీట్లను బీజేపీ సారథ్యంలోని



ఎన్డీయే కూటమి గెలుచు కుంటుందని నేను నమ్మకంతో చెప్పగలను అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గిరిజన సోదర, సోదరీమణుల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ ఏవిధంగా పనిచేస్తోందో మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక కేంద్రంలో బీజేపీ తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు గిరిజన సమాజం కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ప్రస్తావించారు. గిరిజన అక్కచెల్లెళ్లు, అన్నదమ్ముళ్ల ఆత్మ గౌరవమే బీజేపీకి అత్యంత ముఖ్యమైనదని మోదీ అన్నారు. అందుకే తొలిసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు గిరిజనుల కోసం రాష్ట్రాన్ని ఇచ్చామని అన్నారు. ఢిల్లీ నుంచి పని చేసే అవకాశం అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కిందని, ఆయన హయాంలోనే గిరిజన రాష్ట్రాలు ఏర్పడ్డాయని మోదీ గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వాజ్‌పేయి హయాంలోనే ఏర్పాటు అయ్యాయని మోదీ చెప్పారు. ఇక రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తామని మోదీ హామీ ఇచ్చారు. ధరలు తగ్గించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక చట్టవిరుద్ధంగా గిరిజన కూతుళ్ల నుంచి గుంజుకున్న భూములను వెనక్కి ఇప్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్ర గుర్తింపును మసక బారుస్తున్నారని జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిపై మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. జార్ఖండ్ గుర్తింపు మార్చివేసే కుట్ర జరుగుతోందని మోదీ అన్నారు. రాష్ట్రంలో చొరబాటుదారులకు జేఎంఎం-కాంగ్రెస్- ఆర్జేడీ మద్దతిస్తున్నాయని అన్నారు. చొరబాటుదారులే వారి అతిపెద్ద ఓటు బ్యాంక్. జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు చొరబాటుదారుల కోసం ఫేక్ సర్టిఫికేట్లు తయారు చేస్తున్నాయి. గిరిజన ఆడబిడ్డలను చొరబాటుదారులు టార్గెట్‌గా చేసుకుంటున్నారు. ఆడ కూతుళ్ల నోటి కాడా కూడు, భూమి లాక్కుంటున్నారు. అంతేకాదు జేఎంఎం, కాంగ్రెస్ కూటమి స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలను మైనారిటీ ఇన్‌స్టిట్యూషన్లను ప్రకటిస్తున్నాయి. ఈ విద్యా సంస్థల్లో దళితులు, గిరిజనులు, ఓబీసీల రిజర్వేషన్లకు ముగింపు పలుకుతున్నాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే సీతా సోరెన్‌ను అవమానించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ దేశంలోని మహిళలను కించపరిచిందన్నారు. జేఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం యువతను రిక్రూట్‌మెంట్ మాఫియాకు అప్పగించి.. పేపర్ లీక్‌లతో వారి భవిష్యత్తు నాశనం చేస్తోందని మోదీ మండిపడ్డారు. ఆదివాసీల సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కూడా కాంగ్రెస్ ఆలోచించలేదని.. ఈ పని ఎన్డీయే చేసిందన్నారు.

# తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలి

మొదటి పేజీ తరువాయి

ఏటీసీలుగా మారుస్తున్నామన్నారు. విద్యార్థులతో సీఎం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నాం. యువజన సంఘాలు బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించేలా చొరవ చూపాలి. స్కూల్స్, కాలేజీల్లో డ్రాప్ అవుట్స్ సంఖ్య తగ్గాలి. ఇది యువతపై ఉన్న అతి పెద్ద బాధ్యత. యువతరం విద్యను నిర్లక్ష్యం చేయొద్దు. గంజాయి, డ్రగ్స్ లాంటివి పెను ప్రమాదకరం. అలాంటి వ్యసనాల బారిన పడొద్దు. విద్యార్థులు, నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి. కొన్ని రాజకీయ పార్టీలు రెచ్చగొట్టే విధంగా చేసే ప్రకటనలు నమ్మొద్దు. విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ రెండూ ముఖ్యమే. చదువుకున్న వారు ప్రయోజకులు అవుతారు. సామాజిక స్పృహతో సమాజానికి సేవచేసే వారు సమాజంలో హీరోలు అవుతారు. పాఠశాలల్లో విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు గ్రూప్ డిస్కషన్స్ ఏర్పాటు చేయాలి. ఉన్నత చదువులు చదవాలి.. తెలంగాణ పునర్నిర్మాణంలో మీరంతా భాగస్వాములు కావాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



## సాఫీగా ధాన్యం కొనుగోళ్ళు అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్

రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్సు ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం అసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కృష్ణ ఆదిత్యకు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా జిల్లాలకు ఆర్వీ కర్ణన్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేటకు అనితా రామచంద్రన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు డా. ఏ.శరత్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలకు డి.దివ్య, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల్ మరియు నాగర్‌కర్నూల్ జిల్లాలకు రవి, వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు టి.వినయ కృష్ణ రెడ్డి, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు హరిచందన దాసరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కె.సురేంద్ర మోహన్ నియమితులయ్యారు.

# నేడే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

అంటారు. అలాగే 1992 నుంచి డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్న రాష్ట్రాలను బ్లూ స్టేట్స్ అంటారు. ఇక స్వింగ్ స్టేట్స్ లో రెండు పార్టీల మధ్య గెలుపోటములు దోబూచులాడుతాయని భావిస్తారు. ఈసారి ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీతోనే గెలువనున్నారు. ఎందుకంటే పోటీ చాలా తీవ్రంగా ఉన్నది. రాయిటర్స్, ఐపిఎస్ఓఎస్ పోల్ గత వారం అక్టోబర్ 29న ప్రచురించిన దాని ప్రకారం కమలా హారిస్ కే ఆధిక్యత ఉంది. సింగిల్ పర్సంటేజ్ ఆధిక్యతతో డెమోక్రట్లు ఉన్నారు. డెమోక్రాట్లు 44 శాతం, రిపబ్లికన్లు 43 శాతం మేరకు ఓట్లు పొందనున్నారని అంచనా. ఓ సర్వే ప్రకారం స్వింగ్ స్టేట్స్ అరిజోనా, జార్జియా, మిచిగాన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ లలో రిపబ్లికన్ నామినికే మొగ్గ ఉంది. అమెరికాలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త నేట్ సిల్వర్ తాజాగా తన అంచనాలను వెల్లడించారు. ట్రంప్-హారిస్‌ల మధ్య హోరాహోరీ పోరు తప్పదన్నారు. అయితే కొంచెం మొగ్గు మాత్రం రిపబ్లికన్ల వైపే ఉందని చెప్పారు. ఈమేరకు న్యూయార్క్ పోస్టు కథనం ప్రచురించింది. సిల్వర్ మోడల్ అంచనాల ప్రకారం ట్రంప్‌నకు ఎలక్టోరల్ కాలేజ్‌లో 51.5 శాతం ఓట్లు లభించే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. హారిస్ వైపు 48.1శాతం మంది మొగ్గు చూపుతున్నారన్నారు. ఈసందర్భంగా నేట్ సిల్వర్ మాట్లాడుతూ.. న్యూయార్క్ టైమ్స్ స్వింగ్ స్టేట్స్ పోల్స్ హారిస్‌కు సానుకూలంగా ఉన్నా.. అద్భుతంగా మాత్రం లేవు. అలానే మార్నింగ్ కన్‌సల్టెంట్‌వి ట్రంప్‌నకు మంచిగానే ఉన్నా.. అమోఘంగా లేవు. ఇది పూర్తిగా హోరాహోరీ పోరే అని విశ్లేషించారు. రిపబ్లికన్లకు పట్టున్న అయోవాలో ట్రంప్ వెనుకంజలో ఉన్నారంటూ సెల్జర్ సర్వే శనివారం ప్రకటించడాన్ని నేట్ సిల్వర్ ప్రస్తావించారు. ఆ ఒక్క రాష్ట్రంతో అధ్యక్ష పదవి వచ్చే అవకాశం లేదన్నారు. ఆదివారం ఉదయం వరకు సిల్వర్ తాను చేపట్టిన నేషనల్ పోలింగ్ యావరేజ్‌ను విడుదల చేశారు. దీనిలో దేశవ్యాప్తంగా చూసుకొంటే హారిస్‌కు 48.5శాతం ఓట్లు రాగా.. ట్రంప్‌నకు 47.6శాతం ఓట్లు లభించాయి. కానీ, స్వింగ్‌స్టేట్స్ అయిన నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరిజోనాల్లో ట్రంప్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నట్లు పేర్కొన్నారు. హారిస్‌కు మిషిగన్, విస్కాన్సిన్‌లో ఆధిక్యం చూపుతు న్నట్లు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికలను ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ముందస్తు ఓటింగ్ మొదలుకాగా.. నవంబర్ 5న పోలింగ్ జరగనుంది. ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్‌లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఈ క్రమంలో న్యూయార్క్ రాష్ట్రం ఇంగ్లిష్‌కు అదనంగా మరో ఐదు భాషల్లో వీటిని ముద్రించగా.. అందులో భారతీయ భాష 'బెంగాలీ' ఉండటం విశేషం. ఎన్నికల పక్రియలో ఇంగ్లిష్ కాకుండా మరో నాలుగు భాషలకు చోటు కల్పించారు. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ అందుబాటులో ఉందని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జే రియాన్ పేర్కొన్నారు. ఇక్కడ స్థిరపడిన వారికి ఇంగ్లిష్ తెలిసినప్పటికీ మాతృ భాషలో అందుబాటులో ఉండటం ఆయా ప్రాంతాల వారికి సంతోషకర అంశమన్నారు. అయితే, భారత్‌లో అనేక భాషలున్నప్పటికీ గతంలో కోర్టులో వేసిన ఓ దావా వల్ల ఎన్నికల పక్రియలో బెంగాలీకి చోటు లభించింది. ఎన్నికల నిర్వహణలో అనేక దేశాలు ఏకీకృత వ్యవస్థను అనుసరిస్తున్నప్పటికీ అమెరికా మాత్రం ఇందుకు భిన్నం. ప్రచార చట్టాలను ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ పర్యవేక్షిస్తుండగా.. ఎన్నికల పక్రియను మాత్రం ఆయా రాష్ట్రాలు చూసుకుంటాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, పోలింగ్ సమయం, కౌంటింగ్ పక్రియకు ఆయా రాష్ట్రాలు ప్రత్యేక నిబంధనలను పాటిస్తాయి.

# పెండింగ్ బిల్లుల కోసం చలో హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

ఎక్కడికక్కడ అరెస్టులు చేసారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో సమావేశమైన మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి, రేపాక నాగయ్య, గుర్రాలదండి ఆంజనేయులు, దుంప ఆంజనేయులుతోపాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ధరాకు మద్దుతగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్ రావును అరెస్ట్ చేశారు పోలీసులు. మాజీ సర్పంచులకు మద్దతుగా తిరుమలగిరి పీఎస్ ముందు రోడ్డుపైన హరీశ్ రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలి ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ సంజయ్ తోపాటు పలువురు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వాళ్లను పీఎస్ కు తరలించారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ ఛలో హైదరాబాద్‌కు మాజీ సర్పంచ్ లు పిలుపునిచ్చారు. అయితే హైదరాబాద్ కు వెళ్లకుండా మాజీ సర్పంచ్ లను ముందస్తుగా అరెస్ట్ చేశారు పోలీసులు . జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు మాజీ సర్పంచులను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా?అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు



విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్‌లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో మాజీ మంత్రి పోస్టు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అక్రమంగా నిర్బంధించిన, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీష్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలన్న మాజీ సర్పంచులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఖండించారు. ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్, రేవంత్ సర్కార్ ఉదయం 4 గంటలకే వారిని అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బందించడం హేయమైన చర్య అన్నారు. అప్పులు తెచ్చి చేసిన పనులకు బిల్లులు అడిగితే అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు చేసిన పనులకే డబ్బులు ఇవ్వమంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు ఇంత కోపమొచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌కు మాజీ సర్పంచులంటే ఎందుకింత కోమని విమర్శించారు. చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించేందుకు డబ్బులు ఉండవు కానీ, బడా కాంట్రాక్టులకు కమిషన్ల కోసం బిల్లులు చెల్లించేందుకు డబ్బులు ఉంటాయన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించడానికి డబ్బులు లేవు కానీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజగోపాల్ రెడ్డిలకు ఇవ్వడానికి, రూ.లక్షన్నర కోట్లతో మూసీ ప్రాజెక్ట్ చేపట్టడానికి రేవంత్ రెడ్డి దగ్గర డబ్బు ఉందని మండిపడారు. పది నెలలుగా అడుగుతున్నా బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లను ప్రభుత్వం వేధిస్తున్నదని చెప్పారు. ఇప్పటికే గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది, పారిశుద్ధ్యం పడకేసిందని విమర్శించారు. మాజీ సర్పంచ్‌ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన మాజీ సర్పంచ్‌లను బేషరతుగా విడుదల చేయాలన్నారు.

# హింసించే పులకేశిలా రేవంత్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

మార్చినందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున యావత్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీని కేటీఆర్ డిమాండ్ చేశారు. పదేళ్లలో ఘనంగా అభివృద్ధి చెందిన తెలంగాణకు విచ్చేస్తున్న రాహుల్ గాంధీకి.. పచ్చగా ఉన్న తెలంగాణ మీ ఏడాది పాలనలోనే ఏ విధంగా వందేళ్ల విధ్వంసానికి గురైందో మీ రాక సందర్భంగా ఒక్కసారి మీకు గుర్తు చేయదలచుకున్నా నన్నారు. ఎన్నికలకు ముందు తెలంగాణలో ఏ పిల్లాడికి కూడా కష్టమొచ్చిన సరే ఇలా పిలుస్తే అలా వస్తానని చెప్పి.. తీరా గద్దెనెక్కిన తర్వాత మా ప్రజల గొంతును తడిగుడ్డతో కోశారని ధ్వజమెత్తారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు ఇలా ఒక్కరంటే సమాజంలో అన్ని వర్గాలను నయవంచనకు గురి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో వచ్చిన మరుసటి రోజు నుంచే మీ నయవంచన స్వరూపం ఎలా ఉంటుందో ప్రజలకు రుచి చూపించారని కేటీఆర్ ధ్వజమెత్తారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అంటూ ఊదరగొట్టి మూడు వందల రోజులు దాటినా సరే వాటిని అమలు చేయటం చేతకాక చేతులెత్తేశారని ఆరోపించారు. కాంగ్రెస్ కబంధ హస్తల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు విలవిలలాడుతోందని.. అభయహస్తమని నమ్మబలికి భస్మాసుర హస్తంతో తెలంగాణ ప్రజలను నిండా ముంచారని.. అన్నారు. ఆరు గ్యారంటీలు, అభయ హస్తం అంటూ ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు ముందుగా ఢిల్లీ నుంచి వచ్చి నాంది పలకింది రాహుల్ గాంధీయేనని.. యథా రాజా తథా ప్రజా.. అన్న తరహాలోనే మీ బాటలోనే తెలంగాణ నాయకులు నడుస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత నాది అని చెప్పారని.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువైపు తొంగి కూడా చూడలేదని విమర్శించారు. మూడు వందల రోజులైనా ఒక పరిమిత ఉచిత బస్ మినహా ఒక్క గ్యారంటీని అమలు చేయలేని అసమర్థత అని.. రైతులకు రుణమాఫీ అని చెప్పి సగం మందికి కూడా రుణాలు మాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ, హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజల పొట్ట కొడుతున్నాడు. హైడ్రా, మూసీ పేరు చెబితినే ప్రజలు హడలిపోయే పరిస్థితి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు గూడు కట్టిస్తామంటూ నమ్మబలికి వాళ్ల గూడును చెదరగొట్టిన గొప్ప పాలన మీ ప్రభుత్వానిది. అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల దగ్గరకు వెళ్లేందుకు రాహుల్ గాంధీకి దమ్ముందా ? సవాల్ విసిరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు, రక్షణ కల్పిస్తున్న పోలీసులు, మూసీ, హైడ్రా బాధితులను, ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులు, ఆటో డ్రైవర్లు.. అసలు తెలంగాణ ప్రజల ముందుకు వచ్చేందుకు రాహుల్ గాంధీకి దమ్ముందా? అని ప్రశ్నించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024




# ఏర్పాట్లను పరిశీలించిన స్థానిక గౌరవ శాసనసభ్యులు





శ్రీశైలం, నవంబర్ 4 (రోమింగ్ న్యూస్) : స్థానిక గౌరవ శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి కార్తీకమాసంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్లు, విరాళాల సేకరణ కేంద్రం మొదలైన వాటిని వారు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యుల వారు మాట్లాడుతూ క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.సర్వదర్శనం, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్ల ద్వారా వెళ్ళే భక్తులు సౌకర్యవంతంగా శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకునే విధంగా ఆయా చర్యలు చేపడుతుండాలన్నారు.

**గోసంరక్షణశాలను పరిశీలన:-**

ఈ రోజు (04.11,2024) శాసనసభ్యుల వారు దేవస్థానం గో సంరక్షణశాలను కూడా సందర్శించారు. గో సంరక్షణకై తీసుకోబడుతున్నచర్యలు, రోజువారి గోగ్రాస వినియోగం, గోసంరక్షణకై వినియోగించే ఔషధాల వివరాలు, విభూతితయారీ, విభూతి అమ్మకాలు మొదలైన అంశాలను పరిశీలించారు.దేవస్థాన ఇంఛార్జి కార్యనిర్వహణాధికారి ఈ. చంద్రశేఖరరెడ్డి ఆయా వివరాలను గౌరవ శాసనసభ్యుల వారికి వివరించారు.

ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యుల వారు మాట్లాడుతూ అవసరం మేరకు గోసంరక్షణ కోసమై గోశాలలో మరో షెడ్డును కూడా నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.ముఖ్యంగా గోవులన్నింటికీ శాస్త్రీయ ప్రమాణాలకు అనుగుణంగా పౌష్టికమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఎప్పటికప్పుడు గోవులకు తగినంత మేత, తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతుండాలని గోశాల సిబ్బందికి సూచించారు. గోవులకు అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటికి కాలానుగుణంగా టీకా మందులు వేయించాలని సిబ్బందికి సూచించారు. గోసంరక్షణకు అవసరమైన అన్ని ఔషధాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.తరువాత గోసంరక్షణశాలలోని విభూతి తయారీ కేంద్రంలో విభూతి తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఆలయాన్ని సందర్శించే భక్తుల రద్దీకనుగుణంగా విభూతి తయారీ ఉండాలన్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యుల వారి సమక్షములో ఎల్.వి. ప్రసాదరెడ్డి, మార్కాపురం వారు పలు రకాల గోవుల ఔషధాలను గో సంరక్షణశాలకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ వారి తండ్రిగారైన పశువైద్యులు స్వర్గీయ డా.ఎల్.వి. నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఈ గోవులకు సంబంధించిన మందులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో దాత కుటుంబసభ్యులు కూడా పాల్గొన్నారు.



# మహానంది దేవస్థానంలో భక్తుల దగ్గర నిలువ దోపిడీ

### ఆలయ అధికారుల పర్యవేక్షణ శూన్యం

### ఒక్క టెంకాయ కొడితే 100 రూపాయలు ఇవ్వాల్సిందే!

శ్రీశైలం, నవంబర్ 4 (రోమింగ్ న్యూస్ ) : కార్తీక మాసం ప్రారంభం అవడంతో మొదటి సోమవారమైనందున మహానంది దేవస్థానానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఇదే ఆసరాగా తీసుకొని భక్తుల దగ్గర నుండి నిలువ దోపిడి చేస్తున్నారు. నేడు స్థానికులైన కొందరు కార్తీక మాసం మొదటి సోమవారం అవడంతో దర్శనార్థమై టెంకా య తీసుకొని లోపలికి వెళ్లిన అనంతరం, శివాలయం పక్కనే ఉన్న టెంకాయల టెండర్ల దారులు, టెంకాయ కొట్టి ఇచ్చిన అనంతరం దక్షిణ అడిగారు అయితే భక్తులు తమ వంతుగా ఏమీ ఆలోచించకుండా 100 రూ పాయలు ఇచ్చి, 10 రూపాయలు తీసుకొని చిల్లర ఇవ్వమని అడగ్గా, వారు ఏమీ పట్టించు కోకుండా తమ పని తాము చేసుకుం టూ ముందుకు వెళ్ళసాగారు, అయి తే వంద రూపాయలు ఇచ్చినటువంటి భక్తు లు ఇదేమి పరిస్థితి ఒక్క టెంకాయ కొడితే 100 రూపాయల? అది కూడా స్థానికులం మీరు అడిగినట్టుగానే మేము దక్షిణ అయితే ఇ చ్చాం, కానీ మా దగ్గరే ఇంత నిలువు దోపిడీ చేస్తున్నారంటే అధిక సంఖ్యలో కొత్త వాళ్లు ఎంతోమంది వస్తుంటారు. ఇలా ఎంత నిలువు దోపిడీ చేస్తున్నారో అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ ఏఈఓ మధుకు ఫిర్యాదు చేయడంతో అక్కడ టెంకా యలు కొట్టే వారిని బయటికి పంపించినట్లు తెలుస్తుంది.

# సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధం

### సాయంత్ర వేళ టీచర్లకు బాధ్యతలు

### స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం




హైదరాబాద్,నవంబర్ 4 : తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వేకు రంగం సిద్ధమయ్యింది. రోజూ ట్వీట్ల మీద ట్వీట్లు వదులుతున్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ గతంలో చేపట్టిన సర్వేకు సంధించి ట్వీట్ను వదలడంలేదు. ప్రభుత్వం కూడా అది ఏమయ్యిందో చెప్పడం లేదు. మొత్తంగా కాంగ్రెస్ అను కున్న విధంగా బిసి గణనతో పాటు కుటుంబ సర్వే గణన నవంబర్ 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా మొదలుకానుంది. అయితే ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను ఇచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేపడాతరని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించడం పై జిల్లాల కలెక్టర్లు, మంత్రులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇప్పటికే దిశా నిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణనను సమర్థవంతంగా నిర్వహించాలని భావిస్తోంది. దేశానికి ఆదర్శంగా తమసర్వే ఉంటుందని ప్రకటించారు. ఇప్పటికే పలుమార్లు మంత్రులు, ఉన్నతాధికారు లతో భట్టి విక్రమార్క సమీక్షలు నిర్వహించారు. సమగ్ర ఇంటింటి సర్వే పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వరుస రివ్యూలు చేసారు. కులగణన కోసం స్కూల్ టైమింగ్ ముగిసిన తరువాత ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు 5 నుంచి 7 ఇళ్లలో వివరాలను సేకరించేలా ప్లాన్ చేయాలని సూచించారు. వారి విధులకు భంగం వాటిల్లకుండా, పిల్లలపై ప్రభావం పడకుండా ఈ నిర్ణయం తీసుకున్నారు. సమగ్ర సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు తగిన వేతనం ఇస్తామన్నారు. వారు ప్రజల ఇంటికి వెళ్లి అడగాల్సిన 50 ప్రశ్నలపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా సూపర్ వైజర్లతో రివ్యూ మీటింగ్ నిర్వహించి తగిన సూచనలు చేయాలన్నారు. ఇవన్నీ ప్రాతిపదికన నవంబర్ 6 నుంచి తెలంగాణ వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే మొదలవుతుంది. గతంలో కేసీఆర్ హయాంలో తెలంగాణలో సమగ్ర కుటుంబసర్వే నిర్వహించారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ, కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం ఇంటింటి సర్వే చేపడుతోందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ఒక్కో ఇంటికి వెళ్లి దాదాపు 50 ప్రశ్నలు అడిగి పూర్తి వివరాలు సేకరిస్తారు. దీన్ని సమగ్ర, సామాజిక, ఆర్థిక సర్వేగా పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో రెండు నుంచి మూడు వారాల్లో సర్వే పూర్తి చేస్తారు. ఆ వివరాలు వారం నుంచి పది రోజుల్లో కంప్యూటరీకరణ చేయనున్నారు.

# చిత్తవుతున్న పత్తి రైతులు



### అందని ద్రాక్షలా గిట్టుబాటు ధరలు

### దళారీలను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

విజయనగరం,నవంబర్ 4 : జిల్లాలో పత్తి రైతులు చిత్తవుతున్నారు. మద్ధతు ధర లభించక విలవిల్లాడుతున్నారు.రైతులు అనివార్యంగా ప్రయివేటు వ్యాపారులకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పత్తి పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందని ద్రాక్షలా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్న పరిస్థితి ఏర్పడింది. గతంలో ఏటా ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తి కొనుగోలు చేపట్టేది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సాలూరు ఎఎంసి యార్డులో సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే అవకాశం వుండేది. అయితే గత కొంతకాలంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండా చేతులెత్తేసింది. దీంతో జిల్లాలో సాలూరు, పాచిపెంట, మక్కువ, కొమరాడ, పార్వతీపురం, బల్జిపేట, కురుపాం, పాలకొండ, సీతంపేట మండలాల్లో సుమారు 12వేల ఎకరాల్లో పత్తి సాగతువుంది. దిగుబడి సుమారు 20వేల క్వింటాళ్ల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పొడవు గింజ పత్తి క్వింటాలుకు రూ.7500, పొట్టి గింజ పత్తి రూ.7120కు కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కాటన్ కార్పొరేషన్ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులకే విక్రయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులు నాణ్యతపై రకరకాల కారణాలతో పత్తి క్వింటాకు రూ.6200 నుంచి రూ.6400 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు క్వింటాకు వెయ్యి రూపాయల వరకు నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమైంది. రైతుల కాయకష్టం దళారుల బోజ్యం గా మారింది.పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితిరైతులు ప్రస్తుతం పత్తి ఏరివేత పనుల్లో వున్నారు. మొదటి విడత ఏరివేత అయిన తరువాత అమ్ముకోవాల్సిన పరిస్థితి వుంది. ఎకరా పత్తి సాగుకు రైతులు సుమారు రూ.25వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దుక్కి నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు, పండించిన తర్వాత ఏరివేత, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎకరా భూమిలో నాలుగు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి అవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ధర ప్రకారం చూస్తే రైతులు పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మద్దతు ధర లభిస్తే ఎకరానికి రూ.5వేల నుంచి రూ.పదివేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధర లభించక పోతే తమ కష్టం దళారీల పాలయినట్లేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాటన్ జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కురామభద్రపురం మండలంలోని ముచ్చర్లవలస గ్రామంలో నందిని కాటన్ జిన్నింగ్ మిల్లు వుంది. గత కొన్నేళ్లుగా ఈ మిల్లు యాజమాన్యం పత్తి రైతులను అడ్డగోలుగా దోపిడీ చేస్తోంది. వ్యవసాయ, మార్కెటింగ్, సిసిఐ అధికారులు జిన్నింగ్ మిల్లు యాజమాన్యంతో కుమ్మక్కై రైతులకు మద్దతు ధర అందకుండా చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం వరకు సాలూరు ఎఎంసి యార్డ్లో సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేది. అయితే గత రెండేళ్లుగా సిసిఐ కొనుగోలు కేంద్రం జిన్నింగ్ మిల్లు వద్దనే ఏర్పాటు చేసి రైతులను దోపిడీకి గురి చేస్తోంది. మన్యం జిల్లాలో పత్తి సాగు చేస్తున్న సుదూర మండలాలైన పాలకొండ, సీతంపేట, భామిని, కొమరాడ, కురుపాం నుంచి కూడా పత్తిని జిన్నింగ్ మిల్లు వద్దకే తీసుకొచ్చి అమ్ము కోవాల్సిన పరిస్థితిని అధికారులు కల్పిస్తున్నారు. 50 నుంచి వంద కిలోమీటర్ల దూరం నుంచి పత్తిని రైతులు తీసుకురావడం కష్టమైన పనిగా భావిస్తున్నారు. దీంతో నష్టానికైనా వ్యాపారులకే తెగనమ్ముకొంటున్నారు. జిన్నింగ్ మిల్లు యజమాని కూడా కమిషన్ ఏజెంట్లను నియమించుకుని గ్రామాల్లో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

# దీపం జ్ఞానానికి ప్రతీక

### శివకేశవులకు ప్రీతిపాత్రం కార్తీకం

### కార్తీక దీపాలకు అందుకే ప్రత్యేకత

శ్రీశైలం,నవంబర్ 4 : శివకేశవులకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం కార్తీకం. ఈ నెలలో చంద్రుని వెన్నెలకాంతులు పౌర్ణమి రోజున నిండుగా భూమిపైకి ప్రసరిస్తాయి. స్వచ్ఛమైన పాలనురుగు లాంటి వెన్నెలను మనం పౌర్ణమి రోజున వీక్షించగలం. శ్రీశైలంలో భక్తుల రద్దీ పెరిగింది. ఇక్కడ దీపాలంకరణ చేపట్టారు. క్షీరసాగర మధన సమయంలో వెలువడిన హాలహాలాన్ని పరమేశ్వరుడు సేవించి తన గొంతులో వుంచుకున్నాడు. అయితే ఆ విష ప్రభావానికి శివుడు అస్వస్థతకు గురయ్యాడు. అగ్ని స్వభావం గలిగిన ఆ విషం నుంచి మహేశ్వరుడిని కాపాడమని అమ్మవారు అగ్నిదేవున్ని ప్రార్థించింది. అనేక సపర్యల అనంతరం శివుడు కోలుకున్నాడు. అగ్నిస్వభావం వున్న కృతికానక్షత్రానికి పార్వతీదేవి కృతజ్ఞతగా కార్తీక పౌర్ణమి నాడు జ్వాలాతోరణం ఏర్పాటుచేసింది. అందుకనే ఈ పౌర్ణమిని అత్యంత విశిష్టమైనదిగా పేర్కొంటారు. ఈ రోజున మహిళలు పగలంతా ఉపవాస దీక్షలో వుండి రాత్రి దీపారాధన చేయాలి. ఇంటి ముందు వాకిట్లలో, పుణ్యతీర్థాల్లో, దేవాలయప్రాంగణాల్లో , నదీతీరాల్లో, పుష్కరిణుల్లో దీపాలను వెలిగిస్తారు.ఇదో అద్భుతఘట్టం. కార్తీక మాసం ఆధ్యాత్మికపరంగా విశిష్టమైన నెల. ఈ మాసంలో అత్యంత పవిత్రమైనది కార్తీకపౌర్ణమి కావడంతో భగవంతుని కృపకు ఎంతో ఉపకరిస్తుంది. ఈ రోజున తమ శక్తికొలది దానాలు చేస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. మార్కండేయ పురాణగ్రంథం దానం చేస్తే మంచిదని ధర్మగ్రంథాలు పేర్కొంటున్నాయి. సంవత్సరంలో ప్రతి మాసానికీ ఒక్కొక్క విశిష్టత ఉంటుంది. అన్ని మాసాల్లోనూ కార్తికమాసానిది ఓ విశిష్టశైలి. ఇది హరిహరులకు ప్రీతికరమైన మాసమంటారు. హరి స్థితికారకుడైతే, హరుడు శుభంకరుడు. వీరిద్దరి ఆరాధన అంటే- మనం చరించే 'స్థితిగతి' సవ్యంగానూ, ఆచరించే ప్రతీ కర్మ శుభాలనిచ్చేదిగానూ ఉండాలన్న ఆశయసిద్ధికై అంతర్ముఖయానం గావించుకోవాలన్న దానికి ప్రతీక ఈ మాసమని చెబుతారు. కార్తికస్నానం, దీపం, వ్రతం, పౌర్ణమి, సమారాధన, ఉపవాసాలు, జాగరణలు భక్తితత్వాన్ని పెంచేవిధంగా ఉంటాయి. కార్తిక సోమవారాలు మరింత ప్రత్యేకం. మాసంలో ప్రాతఃకాలపు స్నానాలకు ఎంతో ప్రాముఖ్యమిస్తారు. ప్రాతఃకాలంలో చేసే స్నానం రుషీస్నానం, ఉత్తమమైంది. ఈ మాసం ప్రవేశించేనాటికి వర్షరుతువు సమాప్తమవుతుంది. వర్షజలధారలు సమస్తమూలికల సారాన్ని, భూపొరల్లోని ధాతువుల సారాన్ని కలగలుపుకొని నదుల్లోకి అంతర్వాహినిగా వచ్చిచేరతాయి. షధజలంలా జలప్రవాహాలు పరిఢవిల్లుతాయి. ప్రవాహవేగానికి ఎదురుగా నిలబడి స్నానమాచరిస్తే- జలప్రవాహాల్లో ఔషధీయగుణాలు, విద్యుత్ తరంగాలు దేహానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. స్నానానంతరం రావిచెట్టు, తులసి, ఉసిరిక చెట్ల వద్ద దీపారాధన, దైవారాధన చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ వృక్షసంపద ఆరోగ్య భాగ్యాన్ని కలుగజేస్తుంది. యజ్ఞ ద్రవ్యంగానూ ఉపయోగపడుతుంది. జ్ఞానానికి చిహ్నం దీపం. సర్వసంపదలు జ్ఞానంవల్ల లభిస్తాయి. ఈ మాసంలో దీపదానం ప్రాశస్త్యం చాలా ఉంటుంది. ఈ మాసం ఆసాంతం దీపారాధన చేసి చివరిరోజున వెలుగుతున్న వెండి ప్రమిదను దానంచేస్తే- అనంతపుణ్యఫలం, సకల ఐశ్వర్యాలు కలుగుతాయంటారు. జ్ఞానం సకల సంపదలకు నెలవు కాబట్టి, ఆ జ్ఞానాన్ని పదుగురికీ పంచి ప్రకాశవంతమైన జీవనవిధానాన్ని సమాజంలో నెలకొల్పాలన్న సందేశం ఇందులో ఉంది. మానవాతావరం దృష్ట్యా ఏక భుక్తమే ఆరోగ్యానికి శ్రీరామరక్ష. ఈ కాలంలో జఠరాగ్ని మందంగా ఉంటుంది. దాన్ని చురుగ్గా ఉంచేందుకు ఏకభుక్తమే ఔషధం. అన్నార్తుల క్షోభ ఎటువంటిదో తెలుసుకోవాలన్నది ఉపవాసాల పరమార్థం. ఉపవాసం అంటే ఆహారంలేకుండా దినం గడపడమని కాదు- భగవత్సాన్నిధ్యంలో ఆ రోజును గడపడం. కార్తిక సోమవారాలది పెద్ద సందడి. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు. మారేడు దళాలతో పూజిస్తే శివసాయుజ్యం లభిస్తుందని పురాణప్రవచనం. శివుడు ప్రేమ మయుడు. విశ్వప్రేమతత్వం అలవరచుకోవడమే శివసాయుజ్యం- అదే జీవన పరమార్థం.కార్తిక పౌర్ణమిరోజున శ్రీమహావిష్ణువును షోడశోపచారాలతో పూజిస్తే యశస్సును, సామ్రాజ్యవైభవాలను పొందుతారని 'పురంజయుని' చరిత్ర తెలియజెబుతోంది. ఇది చాతుర్మాస్యం. కార్తిక శుద్ధ ఏకాదశితో చాతుర్మాస్య వ్రతం పరిసమాప్తమవుతుంది. మానవ జీవితకాలంలో సగం ఆయుష్షు నిద్రకే సరిపోతుంది. మేల్కొని ఉండే జాగ్రదావస్థ, జీవిత స్థితిగతులను సువ్యవస్థీకృతమైన విధానంలో నడుపుకోవాలి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024





# బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదు



**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంపై ఢిల్లీ సర్కారుపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పత్రికల్లో వస్తున్న వార్తలను చూస్తే.. ఢిల్లీలో బాణాసంచా నిషేధం అమలు కాలేదని అనిపిస్తోందని పేర్కొంది. ఇందుకు సంబంధించి సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాణాసంచా నిషేధంపై ఢిల్లీ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి నుంచి ఢిల్లీ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగింది. దాంతో జనం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, కళ్లు ఎర్రబారడం, చికాకు తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ప్రస్తుతం నగరంలోని చాలా ప్రాంతంలో గాలి నాణ్యత సూచి 400 మార్క్‌ని దాటింది. పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకొని డిసెంబర్ 2, 2016న ఎంసీ మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలో గ్రాప్ పాలసీని అమలులోకి తీసుకువచ్చారు. చలికాలంలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇందులో పలు నిబంధనలు ఉన్నాయి. ఇందులో బాణాసంచాపై నిషేధం సైతం ఉన్నది. వాయు కాలుష్యంపై ఢిల్లీ ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. బాణాసంచా నిషేధాన్ని ఎందుకు అమలు చేయడం లేదని సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిషేధం ఉంటే పటాకులు ఎలా పేల్చారు? వీలైనంత త్వరగా సమాధానం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం పెరిగిపోవడంతో మార్నింగ్ వాక్ చేయడం మానేస్తున్నట్లు సీజేఐ చంద్రచూడ్ గురువారం వ్యాఖ్యానించారు. శ్వాసకోశ వ్యాధులను నివారించడానికి ఇంట్లోనే ఉండటమే మంచిదని, ఉదయాన్నే బయటకు వెళ్లకుండా ఉండాలని డాక్టర్ సలహా ఇచ్చారన్న ఆయన.. వాయుకాలుష్యం పెరుగుతుండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

# ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

## 14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తేదీల్లో మార్పు




**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** ఎన్నికల సంఘం కీలక నిర్ణయం ప్రకటించింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల పై కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 13వ తేదీన పలు అసెంబ్లీ స్థానాలకు జరగాల్సిన ఉప ఎన్నికల తేదీల్లో కీలక మార్పు చేసింది. మొత్తం మూడు రాష్ట్రాల్లోని పలు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికలను వారం రోజులపాటూ వాయిదా వేసింది. కేరళ , పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆరోజున పలు మతపరమైన కార్యక్రమాల కారణంగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆర్జేడీ సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్‌ను వాయిదా వేయాలని ఈసీని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు ఈసీ దృష్టికి తీసుకెళ్లాయి. వారి అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ ప్రకటించింది. నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికల పోలింగ్‌ను నవంబర్ 20కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ప్రభావితమైన 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్‌లోని డేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, యూపీలోని ఖైర్, మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్‌పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి. అయితే, ఆయా నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపులో మాత్రం ఎలాంటి మార్పూ చేయలేదు.

# తెలంగాణలో బీసీ కమిషన్ ఏర్పాటు

## మాజీ ఐఎఎస్ ఛైర్మన్‌గా ఉత్తర్వులు.. నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం



**హైదరాబాద్, నవంబర్ 4 :** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ బూసాని వెంకటేశ్వర రావును ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌కు ఛైర్మన్‌గా నియమించింది. సెక్రటరీగా ఐఎఫ్ఎస్ అధికారి బి.సైదులును నియమించింది. హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఈ కమిషన్ ను ఏర్పాటు చేసింది. రిజర్వేషన్లపై అధ్యయనం చేసి నెల రోజుల లోపు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని ఇప్పటికే సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఇదే అంశంపై ఆదివారం మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, ఉన్నతాధికారులతో జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి సమాలోచనలు జరిపారు. కులగణన, స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో ఇటీవల హైకోర్టు లేవనెత్తిన అంశాలను సమీక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 340, సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల కల్పన కోసం బీసీల జనాభా లెక్కలు తీసేందుకు ప్రత్యేక కమిషన్ ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఈ నెల 6 నుంచి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు, న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు కోర్టు తీర్పులను తప్పకుండా అనుసరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌కు విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల్లోగా దీనిపై నివేదిక అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# కేసీఆర్ నుంచి రికవరీ చేసే దమ్ముందా?!



- అసలు "సమగ్ర కుటుంబ సర్వే" నివేదిక ఏమైంది?
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదు?
- మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**కరీంనగర్, నవంబర్ 4:** దేశ, విదేశాల్లో ఉన్న ప్రజలను ఉన్న ఫలంగా రప్పించి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామ దేవత పోచమ్మ తల్లిని బండి దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో కలిసి బోట్ సేవలను ప్రారంభించారు. కలెక్టర్ తోపాటు స్వయంగా బోట్‌లో వెళ్లి దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బోట్ సేవలు అందుబాటులోకి రావడంవల్ల ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. అందరూ దత్తాత్రేయ స్వామిని దర్శించుకోవడంతోపాటు ప్రతి ఒక్కరూ దత్తాత్రేయ స్వామి ఉత్సవాల్లో సంతోషంగా పాల్గొనే అవకాశం లభించిందన్నారు. వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్య ధోరణితో రైతులు రోడ్లపై వడ్ల రాశులు పోసి, అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కుల గణనపై మీడియా అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ తనదైన శైలిలో స్పందించారు. సమగ్ర కుటుంబ సర్వేలో కులం, మతం, ఆదాయం, ఆస్తిపాస్తుల వివరాలన్నీ నమోదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. "ఎన్నేళ్లు ఉన్నా కులమైతే మారదు కదా? మళ్లీ కులగణన పేరుతో ఈ హడావుడి ఎందుకు? అసలు సమగ్ర కుటుంబ సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదో సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. వందల కోట్ల ఖర్చు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టి చేసిన ఆ సర్వే నివేదిక ఏమైందని, ఒకవేళ ఆ వివరాలు లేకపోతే... దానికోసం ఖర్చుపెట్టిన సొమ్మును కేసీఆర్ కుటుంబం నుండి రికవరీ చేయించాలని డిమాండ్‌చేశారు. ఆ దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా? అని సవాల్‌చేశారు.

# ఆగ్రా సమీపంలో కుప్పకూలిన మిగ్ -29

## సురక్షితంగా బయటపడ్డ ఇద్దరు పైలెట్లు

ఆగ్రా,నవంబర్ 4 : ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో మిగ్-29 యుద్ధ విమానం సోమవారంనాడు కుప్పకూలింది. అయితే విమానంలోని ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారు. వైమానిక విన్యాసాల కోసం ఫైటర్ జెట్ పంజాబ్‌లోని అదంపూర్ నుంచి ఆగ్రా వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విమానం కుప్పకూలిన వెంటనే పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనపై విచారణ ఆదేశించినట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు.విమానం కుప్పకూలడానికి కొద్ది ముందే పైలెట్లు ఇద్దరూ విమానం నుంచి దూకేయడంతో సురక్షితంగా బయటపడినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. కగారోల్ లోని సోనిగ గ్రామం సమీపంలోని పొలాల మధ్యల్లో ఫైటర్ జెట్ కూలగడంతో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. విమానం నేలకు తాగగానే ముక్కచెక్కలైందని, మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయని స్థానికులు తెలిపారు.

# యువతిపై ప్రేమోన్మాది దాడి

## గాయాలతో యువతి ఆస్పత్రికి తరలింపు

మెదక్,నవంబర్ 4 : ప్రేమించడం లేదని యువతిపై ఓ ప్రేమోన్మాది కత్తితో దాడికి దిగాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద జరిగింది. యువతిపై ప్రేమోన్మాది ఇక్కడే దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె చేతికి తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం యువతిని హైదరాబాద్‌కు తరలించారు. ఆమె ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాసేందుకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దాడి చేసిన వ్యక్తి బెంగళూరుకు చెందిన యువకుడు చేతన్ అలియాస్ కిరణ్ అని పోలీసులు తెలిపారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పోలీసులు సంఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. దుండగుడి కోసం గాలిస్తున్నారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,నవంబర్ 4 : తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ ఈమేరకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నవంబర్ 5 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కోసం రేపటి నుంచి వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. కాగా, ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి జూన్ 2వ వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహించి ఇప్పటికే ఫలితాలు విడుదల చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఏడాది ఇది రెండో నోటిఫికేషన్ కావడం గమనార్హం.

# ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు

## తాజాగా మరో విద్యార్థి సూసైడ్

జైపూర్, నవంబర్ 4 : ఉన్నత చదువులు, ఉద్యోగాల కోచింగ్‌కు ప్రసిద్ధిగాంచిన రాజస్థాన్‌లో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఒత్తిడి కారణంగా ఇప్పటికే పలువురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా మరో విద్యార్థి తనువు చాలించాడు. బీహార్‌కు చెందిన 16 ఏళ్ల విద్యార్థి జేఈఈ పరీక్షకు సన్నద్ధమవుతున్నాడు. ఏడాది కాలంగా తన తల్లితోపాటు కోటాలోని తలవండి ప్రాంతంలో ఇల్లు అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. అయితే, ఆదివారం రాత్రి డిన్నర్ చేసిన తర్వాత తన గదిలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు కోట డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ యోగేష్ శర్మ తెలిపారు. విద్యార్థిది ఆత్మహత్యా..? లేక సహజ మరణమా..? అనేది ఇంకా నిర్ధారించలేదు. అతడి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని.. శవపరీక్ష తర్వాతే విద్యార్థి మరణానికి గల కారణాలు తెలుస్తాయని ఆయన తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. కాగా, తాజా ఘటనతో కలిసి ఈ ఏడాది కోటా లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం ఇది 16వ ఘటన కావడం గమనార్హం. గతేడాది ఏకంగా 30 మంది దాకా విద్యార్థులు సూసైడ్ చేసుకున్నారు.

# గ్యారంటీలు, డిక్లరేషన్లు ఎటు పోయాయి?

- కాంగ్రెస్‌పాలనకు ఏడాది ముగుస్తుంది
- ఆచరణకు సాధ్యంకాని హామీలు ఇచ్చింది
- గారడీలతో ప్రజలను మోసం చేస్తున్నది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నల వర్షం



**హైదరాబాద్, నవంబర్4:** కాంగ్రెస్ ప్రజలను గారడీలతో మోసం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విద్యానగర్ జామై ఉస్మానియా పాఠశాలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బెంచీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయన్నారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామ న్నారు.. ఏడాది ముగుస్తుంది గ్యారంటీలు, డిక్లరేషన్లు ఎటు పోయాయి? అని కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. కుట్రలు, కుయుక్తులే కాంగ్రెస్ నైజం అని విమర్శించారు. అంతులేని హామీలు, ఆచరణకు సాధ్యంకాని హామీలు, మోసపూరితమైన హామీలు కాంగ్రెస్ ఇచ్చింది.. హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం నిస్సహాయత స్థితిలో ఉండిపోయిందన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి భార్య 15 ఎకరాల ప్రభుత్వ భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ బరి తెగించి ప్రవర్తిస్తోందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు కానీ హామీలిచ్చి పది నెలలో ప్రజల నమ్మకం కోల్పోయిందన్నారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అమలయ్యే సంక్షేమ పథకాలను అటకెక్కించిందన్నా రు. హామీల పేరుతో ప్రజల ఓట్లను కాంగ్రెస్ దండుకుంటుందన్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే ఇచ్చిన గ్యారంటీలు ఎక్కడికిపోయాయి అని కర్ణాటక, తెలంగాణ ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. తెలంగాణలో అమలు అయ్యేది ఒక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్రమే అన్నారు. అశోక్‌నగర్‌లో నిరుద్యోగ యువత ఆకలి కేకలను పోలీస్ లాఠీలతో అణిచి వేస్తున్నారు. బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు తేడా ఏంటో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు. ఏడాది కాకముందే దాదాపు లక్ష కోట్ల అప్పు తీసుకుంది. అప్పులు తేవడం కోసం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. అరకొర రుణమాఫీ చేసి పూర్తిగా చేసినట్లు అబద్ధాలు చెబుతుంది. ఏ పంటకు బోనస్ ఇవ్వలేదు.. సిగ్గు లేకుండా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు తెలంగాణలో 31వేల కోట్ల రుణమాఫీ జరిగిందని ప్రచారం చేస్తున్నారన్నారు. 16,41, 428మందికి ఇంకా రుణమాఫీ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఎంత రుణమాఫీ జరిగిందో ప్రజల ముందు పెట్టాలన్నారు. మహిళలకు తులం బంగారం, స్కూటీలు ఎక్కడికిపోయాయో తెలపాలన్నారు. కొండంత హామీలు ఇచ్చి.. ఎలుకంత హామీలను కూడా అమలు చేయలేదు.. దేశానికి కాంగ్రెస్ పార్టీ శనిలా ఉందన్నారు.

### ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

మెరుగైన ఫర్నిచర్, ల్యాబ్స్‌పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు పెరగాలన్నారు. సర్కారు బడుల అభివృద్ధికి సమాజమంతా బాధ్యత తీసుకోవాలని సూచించారు. కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యం కనిపిస్తోందన్నారు దివాళకోరు, దగాకోరు రాజకీయాలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందన్నారు. అమలు కానీ హామీలు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని కిషన్ రెడ్డి చురకలంటించారు. ఇచ్చిన హామీలకే గతిలేదని, కొత్తగా మళ్లీ హామీలిస్తున్నారన్నారు. డిక్లరేషన్, గ్యారంటీల పేరుతో గారడీ చేశారని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

# ఆదాయా మార్గాలపై ప్రభుత్వం దృష్టి

## భట్టి నేతృత్వంలో ఉపసంఘం భేటీ

హైదరాబాద్,నవంబర్4 : నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి. రాష్ట్రంలో ఆదాయం తగ్గడంతో పాటు అప్పులు పెరుగుతున్నాయి. అలాగే పథకాల అమలుకు కూడా నిధులు వెచ్చించాల్సి వస్తోంది. దీంతో రాబడి పెంచుకునే మార్గాలపై అన్వేషిస్తున్నారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ ఆదాయం భారీగా పడిపోయింది. కొనుగోళ్లు, అమ్మకాలు తగ్గాయి. ఈ క్రమంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024




# ఆనాడు సర్పంచ్‌లను మోసి చేసి..

**నేడు వారితో కలసి ధర్నాలు చేయడమా**

**బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం**

**బకాయిలను మార్చిలోగా చెల్లిస్తామని హామీ**

**కేంద్రమంత్రులు రాష్టానికి చేసిందేమీ లేదని విమర్శలు**



హైదరాబాద్,నవంబర్4 : తెలంగాణలో సర్పంచ్‌లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన బకాయిలకు తాము భరోసా అని అన్నారు. అయితే బకాయిలు చెల్లించని వారే ఆందోళనకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. సర్పంచ్‌ల బకాయిలకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని, రాజకీయ పార్టీల ట్రాప్‌లో పడవద్దన్నారు. గాంధీభవన్‌లో మంత్రి పొన్నం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మాట్లాడారు. సర్పంచులకు మార్చిలోపు బకాయిలు చెల్లిస్తామన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి మాదిరిగా భారాస నేతలు సర్పంచ్‌ల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన వారే.. ఇప్పుడు ధర్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయం అందరికి తెలుసునని చెప్పారు. కాస్తా ఓపిక పట్టాలని ఈ సందర్భంగా సర్పంచులకు మంత్రి పొన్నం సూచించారు. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి బకాయిలు చెల్లిస్తామని రైతులకు మంత్రి స్పష్టం చేశారు. సర్పంచుల బకాయిలు చెల్లించేందుకు తమ ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందన్నారు. పొలిటికల్ పార్టీల ట్రాప్‌లో పడకండంటూ తెలంగాణలోని సర్పంచులకు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణకు ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో వరదలు సంభవించినప్పుడు రూ.10 వేల కోట్ల నష్టం వాటిల్లితే.. కేంద్రం కేవలం రూ.400 కోట్లే ఇచ్చిందని మండిపడ్డారు. ష్ట్రంలో వరద నష్టంపై నివేదికను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తమ ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు. అయితే వరదల వల్ల రూ. 10 వేల కోట్ల నష్టం జరిగితే.. కేంద్రం మాత్రం కేవలం రూ. 4 వందల కోట్లు మాత్రమే సాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై పొన్నం ప్రభాకర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రం నుంచి మోదీ కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు ఏం ప్రయోజనాలు చేకూర్చారని ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి మమ్మల్ని ప్రశ్నించే ముందు గత పదేళ్లలో ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి చేసింది శూన్యమని ఆయన గుర్తు చేశారు. గత దశాబ్ద కాలంలో ఏం చేసిందో చెప్పాలంటూ కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూటిగా సవాల్ విసిరారు. అమర వీరుల స్థూపం వద్ద చర్చకు రావాలని వారిద్దరకు పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా సూచించారు.

ఈ కేంద్ర మంత్రులు ఇద్దరిలో తెలంగాణ డీఎన్ఏ ఉంటే ఏమైనా చేసే వారని.. కానీ వారిలో అది లేదంటూ మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు.మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలను బిఅర్ఎస్ పార్టీ రెచ్చకొట్టే కార్యక్రమం ముగిశాక.. వారికి న్యాయం చేయడానికి తాము వెళతామన్నారు.

# నెమ్మదించిన బంగారం ధరలు

## కొనుగోళ్ల మందగించడంతో తగ్గిన రేట్లు



న్యూఢిల్లీ, నవంబర్ 4 : పండగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఇటీవల వరుసగా దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు కాస్త నెమ్మదించాయి. ధరలు విపరీతంగా పెరగడంతో కొనుగోళ్లు మందగించాయి. ఈ క్రమంలో సోమవారం కాస్త ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి ధర రూ.1300 మేర తగ్గి రూ.81,100కు చేరినట్లు ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం గరిష్ఠంగా రూ.82,400 మేర పలికిన సంగతి తెలిసిందే. ఇటీవల కాలం లక్ష రూపాయల మార్కు దాటిన కిలో వెండి ధర సైతం దిగొచ్చింది. గురువారం రూ.99,500 పలకగా.. దిల్లీలో సోమవారం దీని ధర రూ.4600 తగ్గి రూ.94,900కు చేరింది. బంగారం వర్తకులు, రిటైలర్ల నుంచి ఆశించిన మేర డిమాండ్ లేకపోవడంతో బంగారం, వెండి ధరల తగ్గుముఖం పట్టడానికి కారణమని అనలిస్టులు చెబుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ఔన్సు 2740 డాలర్ల వద్ద కొసాగుతుండగా.. వెండి ఔన్సు 32.80 డాలర్లుగా ఉంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు, 7న ఫెడరల్ రిజర్వ్ 7న వడ్డీ రేట్ల ప్రకటన వంటి ప్రధాన ఈవెంట్లు ఈ వారంలో ఉన్నాయి. మరో వైపు ఫెడ్ ఈ వారంలో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ తగ్గించొచ్చని భావిస్తున్నారు. ఈ రెండు అంశాలు ఈ వారం బంగారం ధరలను దిశా నిర్దేశర చేయొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. చైనా కూడా ఈ వారంలో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశం ఉండడంతో ఇది కూడా అంతర్జాతీయంగా బంగారం ధరలను ప్రభావితం చేయొచ్చని భావిస్తున్నారు. మొత్తంగా ధరలు తగ్గినా...ఇప్పటి వరకు పెరిగిన రేట్లతో పోలిస్తే మాత్రం ఈ తగ్గుదల అంతంత మాత్రంగానే చూడాలి.

# యాప్ ద్వారా ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక

**అర్హులైన పేదలందరికీ ఇళ్ల నిర్మాణం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



ఖమ్మం,నవంబర్4 : ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పార్టీలకు, కులాలకు అతీతంగా గ్రామ సభలు పెట్టి అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించే కార్యక్రమం చేపట్టామని అన్నారు.మరో రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ మొదలవుతుందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం దానావాయి గూడెంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా ఇళ్ల నిర్మాణం పరిశీలన జరుగుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూరల్‌లో రూ.71 వేలు , అర్బన్‌లో లక్షా యాభై వేలు రూపాయలు ఇస్తుందని తెలిపారు. మిగిలిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం భరించి పేదవారి చిరకాల స్వప్నం నెరవేరుస్తుందని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో పింక్ కలర్ చొక్కా వేసుకున్న వారికే స్కీంలు ఇచ్చారని.. వారు ఇంకా అదే భ్రమలో ఉన్నారని విమర్శించారు. గ్రామ సభలు పెట్టి మంత్రుల ద్వారా ఇళ్లను అప్రూవ్ చేస్తామని అన్నారు. ఈ ప్రభుత్వానికి పేదవారికి అండగా ఉండాలనే ఆలోచన ఉందని స్పష్టం చేశారు. అర్హులైన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఇళ్లు ఇస్తామని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వంలో లక్షా యాభై వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని బీఆర్ఎస్ నేతలు చెప్పారని అన్నారు. కేవలం 91 వేల ఇళ్లు మాత్రమే కట్టి అందులో మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో 63 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయాయని.. వాటిని కూడా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

# ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం

- **లోతైన లోయలోపడ్డ బస్సు**
- **36మంది ప్రయాణికులు మృతి**



**నైనిటాల్, నవంబర్ 4 :** ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఓవర్‌లోడ్‌తో కూడిన బస్సు లోతైన లోయలో పడడంతో 36 మంది ప్రయాణికులు మరణించారు.మరో 19 మంది గాయపడ్డారు. ఈ ప్రమాద ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. మరోవైపు.. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ఢిల్లీలో తన కార్యక్రమాన్ని రద్దు చేసుకుని సంఘటనా స్థలానికి బయలుదేరారు. బాధితులకు ఆర్థిక సాయం ప్రకటించడంతో పాటు మెజిస్ట్రేట్ విచారణకు కూడా ఆదేశించారు. ఈ ప్రమాద ఘటనపై పౌరీ, రాంనగర్‌లోని ఏఆర్‌టీఓలను వెంటనే సస్పెండ్ చేశారు. గర్వాల్ ప్రాంతంలోని నౌరీ నుంచి కుమావోన్‌లోని రామ్‌నగర్‌కు బస్సు వెళుతున్నట్లు సమాచారం. ర్వాల్ మోటార్ ఓనర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న బస్సు ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. రామ్‌నగర్‌కు కేవలం 35 కిలోమీటర్ల దగ్గర్లో అల్మోరాలోని మార్చులా ప్రాంతంలో 650 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. ఈ ఘటన ఎందుకు, ఎలా జరిగింది అనేది విచారణలో తేలాల్సి ఉంది.ప్రాథమిక కారణం ఓవర్‌లోడింగ్ అని అంటున్నారు. బస్సులో 43 మంది ప్రయాణీకులకు సీట్లు ఉండగా.. అందులో 55 మంది ఉన్నారు. ఇరుకైన మలుపు దగ్గర డ్రైవర్ బస్సును అదుపు చేయలేక కాలువలో పడిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఘటనాస్థలంలోని దృశ్యాలు చూస్తే ప్రమాద తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ అలోక్ కుమార్ పాండే తెలిపారు. ఘటనా స్థలంలో కొంతమంది చనిపోగా.. మరికొంత మందిని ఆసుపత్రికి రలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. గాయపడిన వారిని రాంనగర్ ఉపజిల్లా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని విమానంలో రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించారు. గాయపడిన ఒకరిని హల్ద్వానీలోని ఊ<br>ఆసుపత్రిలో చేర్చారు. అల్మోర ప్రమాద బాధితులకు కేంద్ర,ఊష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం ప్రకటించాయి.రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించగా, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున సాయం అందజేస్తామన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ప్రధానమంత్రి విపత్తు సహాయ నిధి నుంచి అందజేయనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది.

# రంగనాథ్‌తో ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి భేటీ

**హైడ్రా పనితీరు అభినందనీయం అని ప్రశంసలు**

**చెరువుల పరిరక్షణ చర్యలపై చర్చలు**



**హైదరాబాద్, నవంబర్4 :** గొలుసుకట్టు చెరువులు, కాలువల పరిరక్షణపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పర్యావరణవేత్త పురుషోత్తమ్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా హైడ్రా చొరవను పురుషోత్తం రెడ్డి అభినందించారు. పీసీబీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సహకారంతో హైడ్రా లక్ష్యాలు చేరుకోవడం సులభమని పురుషోత్తం రెడ్డి అభిప్రాయపడ్డారు. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యల గురించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ వివరించారు. చెరువుల పరిరక్షణెళి కాదు.. కాలుష్య కారణాల పైనా దృష్టి పెట్టాలన్న పురుషోత్తమ్ రెడ్డి సూచించారు. వర్షపు నీటి పరిరక్షణ, నీటితో నిండిన చెరువులు, భూగర్భ జలాలు, భూమి పొడిగా మారకుండా.. భూమి కాలుష్యమయం అవకుండా హైడ్రా కాపాడాలని ప్రొఫెసర్ సూచించారు. జహీరాబాద్ దగ్గరలోని కొహిర్ మండలం గొట్టిగారిపల్లెలో చెరువులను పరిరక్షించుకునే విధానం బాగా జరిగిందని, ఎలాంటి నీటి వనరులు లేని గ్రామంలో ఇప్పుడు మూడు పంటలు పండిస్తున్నారని, చెరువుల పరిరక్షణ తీరును పరిశీలించాలని పురుషోత్తమ్ రెడ్డి సూచించారు.

# కెనడాలో పరిస్థితులపై కేంద్రం ఆందోళన

**హిందూ దేవాలయంపై దాడి దారుణం.. తీవ్రంగా ఖండించిన విదేశాంగ శాఖ**

న్యూఢిల్లీ, నవంబర్4 : కెనడాలో ఖలిస్థానీల దాడిపట్ల కేంద్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడి హిందువులు లక్ష్యంగా దాడులు జరగడం దారుణమని పేర్కొంది. కెనడాలో మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు.. అక్కడి బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయాన్ని లక్ష్యంగా చేసుకొని భక్తులపై దాడులు చేశారు. దీనిపై భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. ఉగ్రవాదులు, వేర్పాటువాదుల హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాయమని, ఈ తరహా దాడుల నుంచి అన్ని ప్రార్థనాస్థలాలను సంరక్షించాలని మేం కెనడా ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. హింసకు కారకులైన వారిని శిక్షిస్తారని మేం ఆశిస్తున్నాం. కెనడాలో మా దేశీయుల భద్రత గురించి భారత ప్రభుత్వం తీవ్ర ఆందోళన చెందుతోంది. భారతీయులకు కాన్సులర్ సేవలు అందించే దౌత్యవేత్తలు ఈ తరహా బెదిరింపులకు తలొగ్గరని జైస్వాల్ అన్నారు. బ్రాంప్టన్‌లోని ఆలయ కాంప్లెక్స్‌లో కొందరు ఖలిస్థానీలు భక్తులపై దాడులు చేస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఈనేపథ్యంలో ఆలయం వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. దీనిని ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్రంగా పరిగణించారు. అక్కడి ప్రజలు అన్ని మతాలను పాటించే హక్కును కాపాడతామని పేర్కొన్నారు. మరోవైపు కెనడా ఎంపీ చంద్ర ఆర్య స్పందిస్తూ కెనడాలో ఎంత తీవ్రస్థాయిలో హింసాత్మక తీవ్రవాదం పెరిగిపోయిందో ఈ ఘటన చెబుతోందన్నారు. కెనడా హిందువులు ముందుకొచ్చి తమ హక్కులను కాపాడు కోవాలన్నారు. బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయం వెలుపల నిర్వహిస్తోన్న కాన్సులర్ క్యాంప్‌పై ఖలిస్థానీ మద్దతుదారులు దాడి చేయడం తీవ్ర నిరాశపరిచిందని ఒట్టావాలోని ఇండియన్ హై కమిషన్ వ్యాఖ్యానించింది. గత కొన్ని నెలలుగా కెనడాలోని ఆలయాలపై వరుసగా దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. అక్కడి ఆలయ గోడలపై భారత వ్యతిరేక నినాదాలను రాసిన ఘటనలు చోటుచేసుకున్నాయి.



# 24 గంటల కరెంట్ ఘనత కేసీఆర్‌దే

- తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్ ప్రచారం: మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, నవంబర్ 4 :** 24 గంటల కరెంటు విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్న జాతీయ కాంగ్రెస్ వైఖరిపై సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నవ్విపోదురు గాక, నాకేం సిగ్గు అన్నట్టుంది కాంగ్రెస్ పార్టీ తీరు ఉన్నదని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటును అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ అని చెప్పారు. 2018, జనవరి 1 నుంచే రాష్ట్రంలో అన్నదాతలకు 24 గంటల ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. కానీ, ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శిచారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల కరెంటు సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర రేవంత్ రెడ్డిది, కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్టాల్లో ఓట్ల కోసం కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత కరెంటు ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్టాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరో నిదర్శనమని చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024





# విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ మండిపాటు



చెన్నై, నవంబర్ 4 : తమిళ స్టార్ నటుడు విజయ్ దళపతి రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీని ప్రకటించారు. గత నెల తొలిసారి భారీ బహిరంగ సభను కూడా నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆదివారం తమ పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో 26 తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యంగా 'వన్ నేషన్, వన్ ఎలక్షన్', నీట్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే సమయంలో తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై విజయ్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. స్టాలిన్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో అబద్ధాలతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. అయితే, విజయ్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ తాజాగా స్పందించారు. ఎన్నికల హామీలను చాలా వరకూ నెరవేర్చినట్లు స్పష్టం చేశారు. 'మా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని కొందరు వాదిస్తున్నారు. మేము చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చాం. మిగిలిని ఒకటి లేదా రెండు త్వరలోనే అమలు చేస్తాం' అని స్పష్టం చేశారు. ఇదే సమయంలో విజయ్‌పై స్టాలిన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'కొత్త పార్టీలను ప్రారంభించే వారంతా డీఎంకే పతనం గురించి మాట్లాడుతున్నారు. దాని గురించి మాకు ఆందోళన లేదు. విమర్శలను మేం పట్టించుకోం. వారిని మాధానాలిచ్చి మా సమాయన్ని వృథా చేసుకోవాలనుకోవడం లేదు. ప్రజల ప్రయోజనం కోసం పనిచేయడమే మా పని. నాలుగేళ్ల ప్రభుత్వ విజయాల గురించి ఆలోచించాలని వారికి నేను వినమ్రంగా చెప్పాలనుకుంటున్నాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

# కార్తీక తొలి సోమవారం

## కిటకిటలాడిన శైవక్షేత్రాలు

హైదరాబాద్,నవంబర్ 4 : కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెలంగాణలో వేములవాడ, కోటి లింగాల, కాళేశ్వరం, ధర్మపురి, బాసరలతోపాటు ప్రధానాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్య లో కార్తిక దీపాలను వెలిగించారు. ఇక వేయి స్తంభాల గుడిలో భక్తులరద్దీ నెలకొంది. భక్తులు శివుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఏపిలో పంచారామ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర క్షేత్రాల్లో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. పలు ఆలయాలతో పాటు, నదీతీరాల్లో భక్తుల సందడి కనిపించింది. పుణ్యస్నానాలు చేసి శివుడికి అభిషేకాలు నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో సోమావరం కూడా భారీగా భక్తులు తరలి వచ్చారు. కార్తీక మాసం సోమవారం కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో క్షేత్రానికి చేరుకున్నారు. సత్యనారాయస్వామి వ్రతాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన స్థలాల్లో భక్తులతో రద్దీ నెలకొంది. కొండపైన గర్భాలయంలో పాంచనారసింహులతోపాటు శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, శివాలయం, ప్రసాద విక్రయశాల, కొండకింద వ్రత మండపం, లక్ష్మిపుష్కరిణి, అన్నదాన సత్రం, కల్యాణ కట్ట తదితర ప్రాంగణాలు భక్తులతో రద్దీగా మారాయి.

# మహారాష్ట్రలో మొదలైన ఎన్నికల వేడి

## గెలుపే లక్ష్యం ప్రచారాలు

## పోటీ చేస్తున్నట్లు ప్రకటించిన గంటల వ్యవధిలోనే వైదొలిగిన మనోజ్ జరాంగే

నవంబర్ 4 : మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. పలు పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే, ఈ ఎన్నికల్లో పోటీ విషయమై మరాఠా రిజర్వేషన్ కోసం పోరాడుతున్న మనోజ్ జరాంగే పాటిల్ యూటర్న్ తీసుకున్నారు. 'మహా' ఎన్నికల నుంచి వైదొలిగారు. కాగా, నవంబర్ 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని మనోజ్ జరాంగే ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. తన పార్టీ తరఫున ఏడుగురు అభ్యర్థులను పోటీ చేయించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అదేవిధంగా మరో ఆరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ కూటమి అభ్యర్థుల ఓటమే లక్ష్యంగా ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. మరో 2 నియోజకవర్గాల్లో ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అయితే, గంటల వ్యవధిలోనే యూటర్న్ తీసుకున్నారు. మహారాష్ట్ర ఎన్నికల నుంచి వైదొలిగారు. 'ఒకే కులం బలంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవడం అసాధ్యం. మనం రాజకీయాల్లోకి కొత్త. అభ్యర్థిని నిలబెట్టి ఓడిపోతే ఆ కులానికి అవమానం. అందుకే మరాఠా అభ్యర్థులందరినీ అభ్యర్థిస్తున్నాను.. తమ నామినేషన్లను ఉపసంహరించుకోండి' అని అన్నారు. మరాఠాలకు న్యాయం చేయని వారిపై మాత్రమే పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కాగా, విద్యాసంస్థలు, ఉద్యోగాల్లో మరాఠా వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతంగా సాగిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనలకు సామాజిక కార్యకర్త అయిన మనోజ్ జరాంగే నేతృత్వం వహించారు. గతేడాది నుంచి ఏకంగా ఆరుసార్లు నిరాహార దీక్షకు దిగారు. అప్పటి నుంచి ఆయన పేరు నిత్యం హెడ్‌లైన్స్‌లో నిలుస్తోంది. ఈ దీక్షతో దిగివచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనతో చర్చలు కూడా జరిపింది. జరాంగే ఉద్యమం కారణంగా ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 'మహాయతి' కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో తాజా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన మద్దతు కోసం వివిధ పార్టీలు క్యూ కట్టాయి. ఈ క్రమంలో ఆయన అనూహ్య నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఇక 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీకి ఒకే విడతలో ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించనుండగా.. 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు.

# పోలీసులు అలసత్వం వీడాలి

## మూడేళ్ల చిన్నారిని రేప్ చేస్తే..

## కులం గురించి మాటలా

## ఇంతవరకు నిందితులను ఎందుకు పట్టుకోలేదు

## క్రిమినల్స్‌ను వెనకేసుకొచ్చేలా ఐపిఎస్‌ల తీరు

## ధైర్యం లేని వారు పోలీసులుగా ఉండతగదు

## పోలీసులు కఠినంగా లేకుంటే క్రిమినల్స్ రెచ్చిపోరా

## నేను హోంమంత్రినైతే పరిస్థితి మరోలా ఉంటుంది

## డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ సంచనల వ్యాఖ్యలు




కాకినాడ,నవంబర్ 4 : రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి ఏమాత్రం బాగోలేదని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. క్రిమినల్స్‌కు కులం, మతం ఉండదని స్పష్టం చేశారు. లైంగికదాడికి తెగబడే వారికి కఠిన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై సీఎం చంద్రబాబు, నేను ప్రత్యేక దృష్టిసారించాం. అయినప్పటికీ కొందరు పోలీసులు అలసత్వం వీడటం లేదు. నిజాయితీగా పనిచేయాలని చెబితే మీనమేషాలు లెక్కిస్తున్నారు. మూడేళ్ల చిన్నారిని రేప్ చేసి చంపేస్తే కులం గురించి మాట్లాడుతున్నారు. కొందరు ఐపీఎస్ అధికారులు క్రిమినల్స్‌ను వెనకేసుకుని వచ్చేలా వ్యవహరిస్తున్నారు. నేను హోం శాఖను తీసుకుంటే పరిస్థితి మరోలా ఉంటుంది. ధైర్యం లేనివారు పోలీసులుగా ఉండటం ఎందుకు అని పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. ఇటీవల జరుగుతున్న ఘటనలకు హోం మంత్రి అనిత బాధ్యత వహించాలని కోరారు. సంబంధిత మంత్రులు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. చలనం లేకుండా ఉంటే క్రిమినల్స్ రెచ్చిపోతారని చెప్పుకొచ్చారు. పరిస్థితి ఇలానే ఉంటే తానే హోంమంత్రి బాధ్యతలు తీసుకోవాల్సి వస్తోందని స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపతున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులో అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...అత్యాచార నిందితుల్ని పోలీసుల వేగంగా అరెస్టు చేయక పోవడంపై జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఠాపురం పర్యటనలో ఉన్న ఆయన పోలీసుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రిమినల్స్‌కు కులం, మతం ఉంబోవన్నారు. అత్యాచార నిందితుల్ని అరెస్టు చేయడానికి కులం ఎందుకు అడ్డం వస్తోందని ఆయన ప్రశ్నించారు. అత్యాచార ఘటనలకు హోంమంత్రి బాధ్యత తీసుకోవాలన్నారు. అదే తాను హోంమంత్రిగా బాధ్యతలు తీసుకుంటే పరిస్థితి వేరుగా ఉండేదన్నారు. జిల్లా అధికారులు, ఎస్పీలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సూచనలు చేశారు. తాము ఎవరినీ వెనకేసుకు రావడం లేదని మీరు కూడా వెనుకేసుకురావొద్దని స్పష్టం చేశారు. మాది ప్రతీకార ప్రభుత్వం కాదని .. అలాగని చేతకాని ప్రభుత్వం కాదన్నారు. అక్కడ ఫార్మా పరిశ్రమతో వ్యర్థాలు, పిల్లలపై లైంగికదాడుల గురించి ప్రస్తావించారు. ఫార్మా పరిశ్రమ వ్యర్థాలతో మత్స్య సంపదకు జరుగుతున్న నష్టంపై పరిశీలిస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు. పిల్లలపై లైంగికదాడులు జరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 'ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ లాగా వ్యవహరిస్తే పరిస్థితి అదుపులోకి వస్తుంది. డీజీపీ ఇంటిలెజెన్స్ అధికారులు బయటకు వస్తే ప్రజలు మమ్మల్ని తిడుతున్నారు. క్రిమినల్స్‌ను అరెస్టు చేయడానికి మాత్రం ముందుకు రావడం లేదు. నాకు డిప్యూటీ సీఎం పదవి, ఎమ్మెల్యే పదవి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే. వసతి గృహాల్లో ఉండే అమ్మాయిలను కొందరు అధికారులు ఇబ్బంది పెడుతున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. ఎంతమంది కూటమి ఎమ్మెల్యేలు అక్కడికి వెళ్లారు. ఇసుకలో ఎంత వస్తుందని కొందరు ఎమ్మెల్యేలు అడుగుతున్నారు తప్ప ఇలాంటి వాటిపై దృష్టిసారించడం లేదని పవన్ కల్యాణ్ మండిపడ్డారు. 'ఇసుక బ్లాక్ మార్కెట్ జరుగుతుంటే ఎదురు తిరగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అందరికీ తినడం అలవాటైపోయింది. దాన్ని మార్చడానికి సీఎం చంద్రబాబు, నేను ప్రయత్నిస్తున్నాం. మీ సొంత అవసరాలకు ఇసుక కావాలంటే బండి లేదా ట్రాక్టర్ తీసుకువచ్చి ఉచితంగా తీసుకువెళ్లండి. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తాం. అందుకోసం 39.76 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు ఉన్నాయని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. శాంతిభద్రతలు చాలా కీలకమైనవని పవన్ కల్యాణ్ అన్నారు. సమాజంలో చిచ్చు పెట్టేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి భావ ప్రకటనా స్వేచ్ఛ అంటున్నారని విమర్శలు గుప్పించారు. పదే పదే మాతో చెప్పించుకోవద్దని పోలీసులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు జరుగుతున్న తప్పిదాలన్ని గత ప్రభుత్వ వాసరత్వాలేనన్నారు. పవన్ కల్యాణ్ ఇదే సమావేశంలో ఇసుకతో పాటు ఇతర విషయాల్లో జరుగుతున్న అంశాలు, వస్తున్న ఆరోపణలపైనా స్పందించారు. గత ప్రభుత్వంలో జరిగినట్లుగా ఇప్పుడు జరిగితే సహించే ప్రశ్నే లేదని ఆయన స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ తాను హోంమంత్రిని అయితే అనే ప్రస్తావన రావడం కలకలం రేపుతోంది. అదే సమయంలో హోంమంత్రి అనిత కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన చెప్పారు. అనిత హోంమంత్రిగా సమర్థంగా పని చేయడం లేదని ఆయన చెప్పకనే చెప్పారని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏపీలో పలు చోట్ల అత్యాచార ఘటనలు జరుగుతున్నాయి. వీటిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారా లేదా అన్న అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పిఠాపరంలోనూ ఓ టీడీపీ నేత మహిళపై అత్యాచారం చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఆయనను అరెస్టు చేశారు. పవన్ కల్యాణ్ ఒక్క పిఠాపురం గురించి మాత్రమే కాకుండా.. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఘటనలపై స్పందించారని అంటున్నారు. అయితే అత్యాచార నిందితుల్లో అరెస్టులు ఆలస్యం అవుతున్న విషయాన్ని పవన్ ప్రస్తావించారని.. అంటున్నారు. ఏదో కేసు విషయంలో పవన్ కల్యాణ్‌కు కులం కారణంగా నిందితుల్ని అరెస్టు చేయలేదన్న సమాచారం అంది ఉంటుందని .. అదుకే ఆయన ఇలా స్పందించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ స్పందనతో పోలీసులు అధికారులు ఎంత వేగంగా స్పందిస్తారో చూడాల్సి ఉంది.

# తీరు మార్చుకుంటే మంచిది

## మంత్రులకు వార్నింగ్ ఇస్తున్న ఏపీ సీఎం

## పార్టీ నేతలు క్రమశిక్షణలో ఉండాలని సూచనలు



అమరావతి, నవంబర్ 4 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా శ్రమిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. తాను పరుగులు పెట్టడంతో పాటు ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా పరుగులు పెట్టిస్తున్నారు. అలాగే తప్పు చేసిన నాయకుల పట్ల కూడా సీఎం సీరియస్‌గా ఉంటున్నారు. స్వంత పార్టీ నేతలను కూడా క్రమశిక్షణలో ఉండాలని.. ఎలాంటి తప్పు చేయకూడదని గట్టిగానే చెబుతున్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యం అని నేతలకు నిర్దేశిస్తున్నారు. తప్పు చేస్తే ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు కూడా. తన మన అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలకు కూడా వార్నింగ్‌లు ఇస్తున్నారు సీఎం. నేతల తీరుతో పార్టీకి ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా సీఎం అలర్ట్‌గా ఉంటూ.. పార్టీ ఎమ్మెల్యేలకు, నేతలకు స్వీట్ వార్నింగ్స్ ఇస్తూనే.. హద్దులు దాటుతున్న వారిని ప్రత్యేకంగా పిలిపించి మరీ హెచ్చరిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఓ మంత్రికి కూడా గట్టిగా క్లాస్ తీసుకున్నారు సీఎం. ఇంతకీ ఎవరా మంత్రి.. ఎందుకు సీఎం క్లాస్ పీకారో ఇప్పుడు తెలుసుకుందాం. మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు క్లాస్ తీసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. టీడీపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి మంత్రికి సీఎం గట్టిగానే క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సభ్యత్వ నమోదులో వెనుకబడి ఉన్నారని.. వేరే రాష్ట్రం నుంచి వచ్చినా ఎమ్మెల్యేను, మంత్రిని చేశానని.. రాజకీయాలపై సీరియస్‌నెస్ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మిమ్మల్ని మీరు నిరూపించుకోకపోతే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వస్తుందంటూ మినిస్టర్‌కు ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు. "సభ్యత్వ నమోదులో అందరికంటే వెనుకబడి ఉన్నావు. రాజకీయాలపై నీకు సీరియస్ తనం రాలేదు. ఫస్ట్ టైం ఎమ్మెల్యేవి, ఫస్ట్ టైం మంత్రివి సభ్యత్వ నమోదులో ఎక్కడున్నావో చూసుకున్నావా. 29% శాతం మాత్రమే సభ్యత్వం నమోదు అయింది. 9000 గాను 2630 మాత్రమే చేశారు. ఫస్ట్ టైం వచ్చావు నీకు పార్టీ చాలా గౌరవించింది. వేరే రాష్ట్రం నుంచి వచ్చిన నీకు ఎమ్మెల్యే ఇచ్చి మంత్రిని చేశాం. నీకు పట్టుదల లేకపోతే ఎలా . సీరియస్‌గా తీసుకోవాలి. నా బాధ్యత నేను చేస్తున్న మీ వాయిస్ మీరు చేయాలి. పార్టీకి ఉపయోగపడకపోతే రాజకీయాలు ఎందుకు. మీరు పని చేయకపోతే ఎమ్మెల్యేగా ఎలా ప్రూవ్ చేసుకుంటారు. మీరు ప్రూవ్ చేసుకోకపోతే ఆల్టర్నేట్ చూసుకుంటా. ఎక్స్పెక్టేషన్స్‌కు తగ్గట్టు పని చేయలేదని ప్రజలకు కూడా తెలియజేస్తా. నేను 95 సీఎంని అని అందరికీ చెప్తున్నా" అంటూ మంత్రి వాసంశెట్టి శుభాష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగానే క్లాస్ తీసుకున్నారు. ఈ వ్యవహారం పార్టీతో పాటూ రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది.

# రాజధాని అమరావతిలో వేగంగా నిర్మాణాలు

## సిఆర్‌డిఎ అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

## టెక్నికల్ కమిటీ నివేదిక ఆధారంగా ముందుకు వెళ్లాలని నిర్ణయం

## వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ



అమరావతి,నవంబర్ 4 : రాజధాని అమరావతిలో నిలిచిపోయిన నిర్మాణాలను ముందుకు తీసుకుని వెళ్లాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 39వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణాలపై ఏర్పాటైన టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించారు. 2019లో వైకాపా ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో వచ్చిన ఇబ్బందులను అధ్యయనం చేసి టెక్నికల్ కమిటీ నివేదిక ఇచ్చింది. రాజధాని నిర్మాణానికి టెండర్లు పొందిన సంస్థలతో వివాదాలు పరిష్కరించేందుకు, మళ్లీ పనులు ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పలు సూచనలు చేసింది. కమిటీ సూచనలు, అదనపు ఆర్థిక భారం వంటి అంశాలపై సీఆర్డీఏ సమావేశంలో చర్చించారు. గత ప్రభుత్వం రాజధాని పేరుతో మూడుముక్కలాట ఆడిందని మంత్రి నారాయణ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతి పనులను వేగవంతం చేశామని చెప్పారు. ప్రపంచంలోని ఐదు ముఖ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు. జులై 24న చీఫ్ ఇంజినీర్లతో సాంకేతిక కమిటీ వేశాం. 2014-19 సమయంలో టెండర్ ఇచ్చిన పనుల గడువు ముగిసింది. పనులకు సంబంధించి చీఫ్ ఇంజినీర్ల కమిటీ అక్టోబరు 29న నివేదిక ఇచ్చింది. అన్ని పనులకు సంబంధించి డిసెంబర్ చివరిలోగా టెండర్లు పిలవాలని ఆదేశించాం. మూడేళ్లలో పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. ప్రపంచ బ్యాంకు రూ.15వేల కోట్ల రుణం ఇస్తుంది. మంత్రులు, జడ్జిలు, ఇతర బంగ్లాలకు రూ.41 వేల కోట్లకు టెండర్లు పిలుస్తాం. రూ.30వేల కోట్ల టెండర్లకు సంబంధించి పనులు మొదలయ్యాయి. నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపడతాం. ఉండవల్లి వద్ద 7,350 క్యూసెక్కులు పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీర్ల కమిటీ నివేదిక ప్రకారం సీఆర్‌డీఏ ముందుకెళ్తుందని నారాయణ తెలిపారు. సిఎం, డిప్యూటి సిఎంలు ఆయా శాఖలపై పూర్తిగా స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం ఉందని, పవన్ వ్యాఖ్యలను సమర్థిస్తూ అన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
5 నవంబర్
2024







# ఐపీఎల్ మెగా వేలం-2025 కోసం ఉత్కంఠ



## రియాద్ వేదికగా వేలం కొనసాగే ఛాన్స్

**ముంబై, నవంబర్ 4 :** ఐపీఎల్ మెగా వేలం-2025 కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. వేలంలో ఏ క్రికెటర్ ఎంత ధర పలకబోతున్నాడు? ఏయే జట్లు ఎవరెవరిని దక్కించుకోనున్నాయి?. కొత్తగా రికార్డులు ఏమైనా బద్దలవుతాయా? అనే ఆసక్తికర చర్చలు అభిమానుల్లో మొదలయ్యాయి. దీనికి తోడు ఇటీవల ఫ్రాంచైజీలన్నీ రిటెన్షన్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించడంతో వేలంలో అందుబాటులో ఉండబోయే ఆటగాళ్లు ఎవరనే స్పష్టత వచ్చింది. దీంతో వేలంపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ ఏడాది ఐపీఎల్ మెగా వేలం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. నవంబర్ 24, 25 తేదీలలో వేలం ఉండొచ్చని అంటున్నారు. ఈసారి వేలంలో స్టార్ బ్యాటర్లు రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్ హాట్ కేకుల్లా అమ్ముడుపోతారనే అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు ఫాఫ్ డు ప్లెసిస్, డేవిడ్ మిల్లర్, అర్ష్‌దీప్ సింగ్, సామ్ కర్రాన్, సికందర్ రజా, కగిసో రబడ, జాస్ బట్లర్, హ్యారీ బ్రూక్, మహ్మద్ సిరాజ్ వంటి ఆటగాళ్లపై కూడా జట్లు కన్నేసి ఉంచే అవకాశం ఉంది. ముఖ్యంగా రిషబ్ పంత్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. రికార్డు ధర పలకవచ్చనే విశ్లేషణలు ఊపందుకున్నాయి. కాగా ఫ్రాంచైజీలు అన్నీ అక్టోబర్ 31న తమ రిటెన్షన్ ఆటగాళ్ల జాబితాలను ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా జట్లు రిటెయిన్ చేసుకున్న ఆటగాళ్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ బ్యాట్స్‌మెన్ హెన్రిచ్ క్లాసెన్‌కు యాజమాన్యం ఏకంగా రూ.23 కోట్లు కట్టబెట్టి రిటెయిన్ చేసుకుంది. ఇక విరాట్ కోహ్లీని రూ.21 కోట్లతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలుపుదల చేసుకుంది. మొత్తం పది జట్లు కలిపి 46 మంది ఆటగాళ్లను రిటెయిన్ చేసుకున్నాయి. అందులో 36 మంది ఇండియన్ క్రికెటర్లు, కాగా 10 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. ఈ ఆటగాళ్ల కోసం జట్లు అన్నీ ఉమ్మడిగా రూ.558.5 కోట్లు వెచ్చించినట్టు అయింది. ఇకపోతే నవంబర్ 22 నుంచి భారత్ - ఆస్ట్రేలియా జట్ల మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ టెస్టు మధ్యలోనే ఐపీఎల్ వేలం నిర్వహిస్తారని తెలుస్తోంది. ఈసారి ఐపీఎల్ మెగా వేలంపై ఆసక్తి పెరిగిపోవడానికి కారణం భారత స్టార్లు ఉండటమే. దూకుడు మీదున్న రిషభ్‌ను ఎవరు సొంతం చేసుకుంటారనే దానిపైనే అభిమానుల దృష్టి ఉంది. వేలంలో భారీ మొత్తం అతడే సొంతం చేసుకుంటాడనే అంచనాలు ఉన్నాయి. కనీసం రూ. 25 కోట్లు దక్కించుకుంటాడని భావిస్తున్నారు. పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ ఓ అడుగు ముందుకేసి రూ. 50 కోట్లు అతడికే ఇవ్వాలని చెప్పడం గమనార్హం. కేఎల్ రాహుల్ కూడా రూ. 20 నుంచి రూ. 25 కోట్లు సొంతం చేసుకుంటాడని భారత మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు.

# టెస్టుల్లో విఫలంపై రోహిత్‌పై విమర్శలు

## దూకుడుగా ఆడడంతోనే సమస్యలన్న దినేశ్



**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** సొంత గడ్డపై తొలిసారిగా టెస్టు సిరీస్‌ను 0-3 తేడాతో అవ మానకర రీతిలో ఓడటంతో టీమ్ఇండియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వేళ్లన్నీ సారథి రోహిత్ శర్మ వైపే చూపిస్తు న్నాయి. ఈ సిరీస్‌లో పేలవ మైన ప్రదర్శనతో రోహిత్ తీవ్రంగా నిరాశపరిచాడు. గ త కొంతకాలంగా టెస్టుల్లో ఫామ్ లేక ఇబ్బంది పడుతు న్నాడు. ఈ నేపథ్యంలో రోహి త్ ఎక్కడ తప్పులు చేస్తున్నాడో అతడి సహచరుడు దినేశ్ కార్తిక్ వివరిస్తూ.. పలు సలహాలూ ఇచ్చాడు. రోహిత్ టెస్టుల్లో గత 10 ఇన్నింగ్స్‌ల్లో చేసిన పరుగులు 133 మాత్రమే. దూకుడుగా ఆడేందుకు వెళ్లి వికెట్ సమర్పించుకుంటున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన ఆఖరి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో పెద్ద షాట్ ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్ చేరాడు. దీనిపై డీకే స్పందిస్తూ.. ఇలాంటి అప్రోచ్ వైట్ బాల్ క్రికెట్‌లో ఆరంభంలో అతడికి గొప్ప ఫలితాలిచ్చిందేమో కానీ.. టెస్టుల్లో తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు. టెస్టుల్లో పెద్ద షాట్లు ఆడకుండా ఉండాలని కార్తిక్ పేర్కొన్నాడు. టెస్టుల్లో ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దూకుడుగా ఆడాలని రోహిత్ భావిస్తున్నాడని నేను అనుకుంటున్నా. వైట్ బాల్ క్రికెట్‌లో ఆడిన అప్రోచ్ టెస్టు క్రికెట్‌కు పనిచేయదు. కొద్దిగా ఒత్తిడికి గురికాగానే ప్రమాదకరమైన అటాకింగ్ షాట్‌కు ప్రయత్నిస్తున్నాడని దినేశ్ అన్నాడు. ఇక రోహిత్ తన టెక్నిక్‌ను నమ్ముకోవాలని.. భారీ షాట్లకు వెళ్లకుండా మరింత బ్యాలెన్స్‌డ్ అప్రోచ్‌తో ఆడాలని సూచించాడు. రోహిత్ శర్మ ఓపెనర్‌గా తన బాధ్యతలను స్వీకరించినప్పుడు గతంలో ఏం చేశాడో ఇప్పుడు అలా చేయడం లేదు. అప్పుడు అతడు తన టెక్నిక్‌ను విశ్వసించేవాడని తెలిపాడు. ఇక స్వదేశంలో జరిగిన గత రెండు టెస్టు సిరీస్‌ల్లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పేలవ ప్రదర్శనలపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా మండిపడ్డారు. వారి కెరీర్ ముగింపునకు ఇదే నాంది అని పేర్కొన్నాడు.

# న్యూజిలాండ్‌తో ఓటమితో టీమిండియాపై ఒత్తిడి

**ఆస్ట్రేలియాతో సిరీస్‌లో గట్టిగా నిలబడక తప్పదు ● మాజీ క్రికెటర్ హర్భజన్‌సింగ్ అభిప్రాయం**



**ముంబై,నవంబర్ 4 :** న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్ ఓడిపోయాక భారత్‌పై ఒత్తిడి పెరగడం సహజం అని భారత మాజీ క్రికెటర్ హర్భజన్‌సింగ్ అభిప్రాయపడ్డాడు. ముమ్మందు ఆస్ట్రేఇయా పర్యటనలో ఇంకా కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. అయితే, లోపాలు బయటపడటం కూడా మంచిదే. తర్వాత సిరీస్‌లో మెరుగుపర్చుకొనేందుకు అవకాశం ఉంటుంది. స్పిన్‌ను ఆడటంలో భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. చివరి మ్యాచ్ కూడా కేవలం మూడు రోజుల్లోనే ముగిసింది. ఇది టెస్టు క్రికెట్‌కు మంచిది కాదు. టెస్టు ఐదు రోజుల పాటు సాగి ఫలితం వస్తే ఆ మజానే వేరు. భారత బ్యాటర్లు ఇలా ఆడతారని ఎవరూ ఊహించి ఉండరని హర్భజన్‌సింగ్ వ్యాఖ్యానించాడు. కివీస్‌తో సిరీస్‌లో మాదిరిగా విరాట్, రోహిత్ ఆడితే ఆసీస్‌పైనా విజయం సాధించడం కష్టమేనని క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే తెలిపాడు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా వారిద్దరి గణాంకాలతో చేసి పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. కివీస్‌తో మూడో టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ ఇంకాస్త సమయం క్రీజ్‌లో ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. నిర్లక్ష్యంగా ఆడటం వల్లే ఓటమి ఎదురైందనే కామెంట్లూ వచ్చాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ మాత్రం వాటిని కొట్టిపడేశాడు. నేనెప్పుడూ రోహిత్ నిర్లక్ష్యంగా ఆడతాడని అనను. అతడు దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాలని చూస్తాడు. డిఫెన్స్‌పై అతడికి నమ్మకం తక్కువ. అందుకే, వేగంగా రన్స్ చేసి ప్రత్యర్థిపై ఒత్తిడి తేవాలని అనుకుంటాడు. ఈక్రమంలో కొన్నిసార్లు ఔట్ అవుతూ ఉంటాడు. డిఫెన్సివ్‌గా ఆడకపోవడమే రోహిత్ ప్రధాన సమస్యని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.



# ఆస్ట్రేలియా బౌలర్లను ఆడుకోలేరు

## మాజీక్రికెటర్ డేవిడ్ వార్నర్ హెచ్చరిక

**సిడ్నీ, నవంబర్ 4 :** స్వదేశంలో టీమిండియా మూడు టెస్టుల సిరీస్‌ను కోల్పోయి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ సందర్భంగా ఆసీస్‌తో ఐదు టెస్టులు ఆడనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకొనేందుకు ఇరు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఆసీస్, భారత్ ఉన్నాయి. గత రెండుసార్లు ఆస్ట్రేలియాను టీమ్ఇండియా ఓడించిన సంగతి తెలిసిందే. హ్యాట్రిక్ కొట్టేందుకు వస్తోన్న భారత్‌కు అడ్డుకట్ట వేస్తామని ఇప్పటికే ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఆసీస్ మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పెద్దగా ఫామ్‌లో లేని భారత బ్యాటర్లను ఆస్ట్రేలియా బౌలింగ్ తీవ్రంగా ఇబ్బందిపెట్టడం ఖాయమని పేర్కొన్నాడు. ఒకవేళ తాను కూడా టీమ్ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో ఉండి ఉంటే తప్పకుండా కంగారుపడేవాడినని వ్యాఖ్యానించాడు. తొలి టెస్టులో భారత్‌ను 46 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్‌ను వార్నర్ ప్రశంసించాడు. అద్భుతమైన బౌలింగ్‌తోపాటు కీలక క్యాచ్‌లను అందుకొన్నారని కొనియాడాడు. ఒకవేళ నేను కూడా భారత్ బ్యాటింగ్ ఆర్డర్‌లో ఉండుంటే.. ఆసీస్ బౌలింగ్ దళాన్ని చూసి కంగారుపడేవాడినే. భారత్‌పై ఆధిపత్యం ప్రదర్శించాలంటే మా టాప్ ఆర్డర్ భారీగా పరుగులు చేయాల్సిందే. షమీ వేగంగా కోలుకొని ఆసీస్ వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతడిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఇక బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అతడితోపాటు సిరాజ్ ఆసీస్ పిచ్‌లపై చెలరేగుతాడు. వారిద్దరిని తట్టుకొని ఆసీస్ బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగుల వరద పారించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఆసీస్ గడ్డపైనే వారు విజేతలుగా నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకున్నారు. ఇక్కడ ఆ జట్టు చాలా బాగా క్రికెట్ ఆడిన సందర్భాలూ ఉన్నాయని వార్నర్ వెల్లడించాడు.

# పంత్‌పై ప్రశంసలు.. రోహిత్‌పై విమర్శలు

## న్యూజిలాంట్ మీడియా తీరు



**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** భారత్‌పై చరిత్రాత్మక టెస్టు సిరీస్ గెలిచిన న్యూజిలాండ్ జట్టును ఆ దేశ మీడియా ఆకాశానికెత్తేసింది. అదే సమయంలో భారత్‌కు చెందిన ఇద్దరు క్రికెట్లరను హైలైట్ చేసింది. అందులో ఒకరు భారత కెప్టెన్ రోహిత్ శర్మ కాగా.. మరొకరు రిషభ్ పంత్. రోహిత్ నాయకత్వం, ఫామ్‌పై విమర్శలు వచ్చాయి. జట్టును సరిగ్గా నడపడంలో విఫలమైన రోహిత్ బ్యాటింగ్‌లోనూ తడబాటుకు గురికావడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసింది. ఇదేవిషయాన్ని కివీస్ మీడియా వేలెత్తి చూపింది. కీలక సమయంలో అనవసర షాట్లకు వెళ్లి వికెట్‌ను సమర్పించాడని ఆక్షేపించింది. ప్రత్యర్థిని తక్కువగా అంచనా వేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని కొన్ని మీడియా సైట్లు పేర్కొన్నాయి. మూడో టెస్టులో బ్యాటర్లంతా విఫలమైన సమయంలో రిషభ్ పంత్ దూకుడుగా ఆడి జట్టును గెలిపించేందుకు ప్రయత్నించాడు. దీంతో పంత్‌పై న్యూజిలాండ్ మీడియా ప్రశంసల వర్షం కురిపిస్తోంది. కేవలం 57 బంతుల్లోనే 64 పరుగులు చేసిన పంత్ ఆట అద్భుతంగా ఉందని అభినందించాయి.. దాదాపు 18 సిరీస్‌ల తర్వాత టీమ్ఇండియా పరాజయం చవిచూసింది. కేవలం ఇంగ్లండ్, ఆస్ట్రేలియా జట్లు మాత్రమే భారత్‌లో టీమ్ఇండియాను ఓడించాయి. ఇప్పడు ఆ జాబితాలో న్యూజిలాండ్ చేరింది.

మంగళవారం
5 నవంబర్
2024

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




## గ్లామర్‌తో ఎట్రాక్ట్ చేస్తున్న మోస్ట్ వాంటెడ్ యాంకర్

తెలుగు టెలివిజన్ ప్రపంచంలో స్రవంతి చొక్కారపు తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. మొదట ఈ తెలుగమ్మాయి యూట్యూబ్ కెరీర్ ద్వారా అందంతో, ఆకర్షణీయమైన యాంకరింగ్ స్టైల్‌తో ప్రేక్షకుల మనసులను కట్టిపడేసింది. ఇటీవల ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పింక్ డ్రెస్‌లోని తాజా ఫోటోలు మరోసారి నెటిజన్లను ఆకర్షించాయి. ఈ ఫోటోషూట్‌లో స్రవంతి సింప్లిసిటీతో పాటు తన గ్లామర్ టచ్‌ను హైలైట్ చేస్తూ, కొత్తగా కనిపించింది. ఆమె బాడీ లాంగ్వేజ్, కళ్ళలోని కాన్ఫిడెన్స్ ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. "మహిళలు ఎదగాలని పట్టుదలగా ఉంటే దాన్ని అడ్డుకునే శక్తి లేదు" అని పేర్కొంటూ ఈ ఫోటోకి ఆమె ఇచ్చిన క్యాప్షన్, ఆమె ఆత్మవిశ్వాసాన్ని, లక్ష్య సాధన పట్ల ఉన్న దీక్షను ప్రతిబింబిస్తుంది.ఈ ఫోటోలు ఆమె యాంకరింగ్ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి ఎంతో ప్రేరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. స్రవంతి ప్రస్తుతం 'ఫ్యామిలీ స్టార్స్' అనే కార్యక్రమంలో యాంకర్‌గా వ్యవహరిస్తోంది. ఈ షోలో ఆమె ప్రదర్శిస్తున్న ప్రతిభ, మాటల పటిమ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ఆమె ధరించిన డ్రెస్, జారా చెవికుమ్మెలు, మేకప్, స్టైలింగ్ ఆమె అందాన్ని మరింతగా ఉట్టిపడేలా చేసాయి.



## ఆ పార్టీలకు వెళితేనే బాలీవుడ్‌లో ఛాన్సులు వస్తాయ్ : రెజీనా

సినిమాల్లోకి వచ్చి దాదాపు 20 యేండ్లు కావొస్తుండగా బాలీవుడ్ ఎంట్రీ ఎందుకు ఆలస్యమైందని ఎదురైన ఓ ప్రశ్నకు రెజీనా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ డియాలోబాగా వైరల్ అవుతున్నాయి. 2019లో ఏక్ లడ్కీ కో దేఖాతో ఐసా లగా' మూవీతో హిందీ సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది రెజీనా. ఆ సమయంలో తనకు ఎదురైన ఘటనల గురించి ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. నార్త్ సినిమా పరిశ్రమకు, సౌత్ ఇండస్ట్రీకి మధ్య తేడాలను చెప్పుకొచ్చింది. సౌత్ నుంచి నార్త్‌కు వెళ్లి లాంగ్వేజ్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కారణంగా చాలామందికి సినిమా అవకాశాలు కోల్పోయారు. కానీ, బాలీవుడ్ నుంచి ఇక్కడకు వచ్చిన వాళ్లు ఎప్పుడూ ఆ ఇబ్బంది పడరు, ఇబ్బంది పెట్టరని పేర్కొంది. హిందీ సినిమాల్లో నటించాలని మనం నిర్ణయించుకున్నప్పుడు ముంబయిలోనే ఉండాలని, మీటింగ్స్ హాజరు కావాలని చెప్పారని.. ఈ విషయం తనకు నచ్చకపోయినా బాలీవుడ్‌లో అదే ముఖ్యమని అర్థమైందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఆ మీటింగ్స్ ఏంటి, అవెలాంటి మీటింగ్స్, ఎవరెవరు వస్తారు, ఇంతకు ముందు ఎంతమంది వీటిల్లో పాల్గొన్నారనే చర్చ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో నడుస్తున్నది. ప్రస్తుతం రెజీనా వ్యాఖ్యలు నెట్టింట బాగా వైరల్‌గా మారాయి. ఇదిలాఉండగా ప్రస్తుతం రెజీనా హిందీ, తెలుగులో రూపొందుతున్న జాట్ సినిమాతో పాటు తమిళంలో అజిత్ విదాముయార్చి'తో పాటు 'ఫ్లాష్‌బ్యాక్' అనే సినిమాల్లో నటిస్తుండగా 'సెక్షన్ 108' అనే ఓ హిందీ చిత్రం కూడా చేస్తోంది.

## తగ్గేదెలే..

### అదిరిన పుష్ప.2 ప్రమోషనల్ ప్లాన్



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ కాంపౌండ్ నుంచి వస్తోన్న ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తుండగా.. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ప్రమోషనల్ ప్లాన్ గట్టిగానే చేశారన్న వార్త అభిమానుల్లో జోష్ నింపుతోంది. లేటెస్ట్ టాక్ ప్రకారం ఫస్ట్ ఈవెంట్‌ను బీహార్‌లోని పాట్నాలో నవంబర్ చివరలో ప్లాన్ చేశారట. ఆ తర్వాత హుబ్లీ, కోచి, చెన్నైలలో పలు మేజర్ ఈవెంట్స్‌ను ప్లాన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను ముంబైలో ఇదివరకెన్నడూ కనివినీ ఎరుగని రీతిలో భారీ జన సందోహం మధ్య నిర్వహించేందుకు రెడీ అవుతున్నారని ఫిలిం నగర్ సర్కిల్ సమాచారం. ప్రమోషన్స్ చివరి ఘట్టంలో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాల్లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌తోపాటు పలు ప్రమోషనల్ ఈవెంట్స్ ప్లాన్ చేసినట్టు టాక్. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## తెలుగు జాతిని అవమానించిన తమిళ నటి

తమిళనాడు రాజకీయాల్లో ద్రావిడ సిద్ధాంతాల ప్రభావం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ సిద్ధాంతం ప్రకారం బ్రాహ్మణులూ.. తమిళులు కాదని వాదన. అయితే ఈ వాదనలను విమర్శిస్తూ నటి కస్తూరి.. "రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన వారే తెలుగు వారు. 300 ఏళ్ల క్రితం ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన తెలుగు వారు ఇప్పుడు తమది తెలుగు జాతి అంటుంటే, మరి ఎప్పుడో ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణులను తమిళులు కాదని చెప్పేందుకు మీరెవరంటూ" మాట్లాడారు. దీంతో ఈ వ్యాఖ్యలు చిచ్చురేపుతున్నాయి. అలాగే "ఆస్తులను లూటీ చేయవద్దని, ఇతరుల భార్యలపై మోజుపడొద్దని, ఒకరికంటే ఎక్కువ మంది భార్యలను చేసుకోవద్దని బ్రాహ్మణులు చెబుతుండటంతోనే తమిళనాడులో వారికి వ్యతిరేకంగా ప్రచారం జరుగుతోందని" కస్తూరి ఆరోపించారు. ఇక లేడీ సూపర్‌స్టార్ నయనతార, విఘ్నేశ్ శివన్ తల్లిదండ్రులైన అయినప్పుడు. ఈ దంపతులు సరోగసి పద్ధతిలో తల్లిదండ్రులైనట్లు వార్తలు చక్కర్లు కొట్టాయి. ఆ తరుణంలో నటి కస్తూరి చేసిన ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. "భారతదేశంలో సరోగసి బ్యాన్ అయింది. జనవరి 2022 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. మెడికల్ రీజన్స్, క్లిష్ట పరిస్థితుల్లో తప్ప దీనిని ఎంకరేజ్ చేయకూడదు. భవిష్యత్తులో దీని గురించి ఎక్కువగా వినబోతున్నాం" అంటూ ఆమె ఓ ట్వీట్ చేసింది. దీనిని చూసిన నయనతార అభిమానులు కస్తూరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'మీ పని మీరు చూసుకోండి' అని నెట్టింట ఏకిపారేస్తున్నారు. దీనిపై కూడా కస్తూరి స్పందించారు. "అర్హతగల న్యాయవాదిగా ఈ చట్టంపై మాట్లాడే హక్కు నాకుంది. నేను ఎవరినీ ఉద్దేశించి ఇలా మాట్లాడలేదు" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి అంటే మీకు ఇష్టం లేదట కదా. ఓ సందర్భంలో మా కుటుంబ సభ్యులు చెప్పారు. ఇష్టం లేనప్పుడు 'గాడ్‌ఫాదర్' చిత్రంలో ఎందుకు యాక్ట్ చేశారు. ఆయనంటే ఇష్టం ఉంటే 'గాడ్ ఫాదర్' సక్సెస్ మీట్ ఫొటోలు షేర్ చేయండి' అంటూ ట్వీట్ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌కు ఆమె కౌంటర్ ఇచ్చారు. "మీరేం మాట్లాడుతున్నారు? ఈ పిచ్చిమాటలు ఎందుకు? చిరంజీవి అంటే ఇష్టపడని వారుండరు. అలాంటిది నా విషయంలో మీ తల్లిదండ్రులు అలా చెప్పడానికి కారణం ఏమిటో నాకు అర్థం కావడం లేదు" అని పేర్కొన్నారు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986